**విలేఖరులు కావలెను**



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా టుడే తెలంగాణ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లు కావలెను. అనుభవం ఆసక్తి గలవారు సంప్రదించండి

98665 32777

todaytelangananews6@gmail.com
www.todaytelangananews.com



TO-DAY TELANGANA
Telugu News Paper

# టుడే తెలంగాణ

తెలుగు దినపత్రిక
నిజం మా నైజం


కష్టం విలువ తెలిసినవారు ఎవరినీ కష్టపెట్టరు
ఇష్టం విలువ తెలిసినవారు ఎవరినీ వదిలిపెట్టరు


సంపుటి: 3 సంచిక: 175 www.todaytelangananews.com తెలంగాణ / ఆంధ్ర ప్రదేశ్ ఆదివారం, మార్చి 29 2026 పేజీలు: 8 వెల: రూ. 5/-

Published from , Suryapet, Nalgonda, Khammam, Bhadradri Kothagudem, Hyderabad, Ranga reddy, Nizamabad, Adilabad ,


## మూసీని అడ్డుకుంటే
# శివతాండవమే..

**ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు**
**మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం**
**దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం**
**మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్**



**రంగారెడ్డి,మార్చి28 :** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ మిగతా2లో...

## అందుబాటులోకి మరో అంతర్జాతీయ
# విమానాశ్రయం

**నొయిడా జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమానాశ్రాయం**
**ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ**
**నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య**
**పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు**



**న్యూఢిల్లీ,మార్చి28 :** మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని మిగతా2లో...

## కంచె చేను మేసినట్లుగా ఉంది

మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా
నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్
హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క



2లో

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని..
# అది అమరావతి

**గతంలో మూడు రాజధానుల పేరిట వైసిపి నాటకాలు**
**భూములు ఇచ్చిన రైతులను కేసులో హింసించారు**
**బలమైన నాయకుడు చంద్రబాబు వల్లనే అభివృద్ధి సాధ్యం**
**అందుకే కూటమి కట్టి ఎన్నికల్లో పోటీ చేశాం**
**అసెంబ్లీలో డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్**



**అమరావతి,మార్చి28 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉందని, అది అమరావతి మాత్రమేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. చంద్రబాబులాంటి వ్యక్తి చేతిలో ఏపీ ఉంటేనే అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాజధాని కోసం మిగతా2లో...



2లో

## చిన్నారులకు పౌష్టికాహారం
# తొలిముద్ద

- పథకాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- అంగన్‌వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని హామీ
- అంగన్‌వాడీలకు సెల్‌ఫోన్లు అందచేత

## వైభవంగా శ్రీసీతరామ
# పట్టాభిషేకం

- వేడుకలో పాల్గొన్న గవర్నర్ శుక్లా



2లో

## తెలంగాణలో
# క్రీడా స్ఫూర్తికి చర్యలు


**గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం**
**ఎల్బీ స్టేడియంలో క్రీడలను ప్రారంభించిన సిఎం**



**హైదరాబాద్,మార్చి28 :** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. మిగతా2లో...

## కాళేశ్వరం అవినీతికి
# కెసిఆర్ బాధ్యుడు

**అవినీతిని పట్టుకోవడంలో సిఎం రేవంత్ విఫలం**
**కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు**
**మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్**



**కరీంనగర్,మార్చి28 :** కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు మిగతా2లో...



## విజయవాడలో
# ఐజెయూ ప్లీనరీ


**ప్రారంభించిన సిఎం చంద్రబాబు**

**విజయవాడ,మార్చి28 :** విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) 11వ ప్లీనరీ సమావేశాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రులు పార్థసారథి,

మిగతా2లో...

## పోలీస్ శాఖపై
# తీవ్ర నిర్లక్ష్యం

**నియామకాల్లో తీరని జాప్యం**
**ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి**
**అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్**



**హైదరాబాద్,మార్చి28 :** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు.. కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం

మిగతా2లో...

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశించే మోదీ మాట్లాడారు. గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్‌వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. మీరు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్‌డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా-దిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ రైల్వేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం అన్నారు. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్‌నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో-లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు. కార్యక్రమంలో యూపి సిఎం యోగి, కేంద్రమంత్రి రమ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని..అది అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. వైసీపీ పాలనలో అమరావతిపై కక్ష కట్టారని, మూడు రాజధానులంటూ మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిపై చర్చలో శనివారం పవన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. 'రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. తెలంగాణ వేరు.. ఏపీ వేరు అనే భావన మాకెప్పుడూ లేదు. తెలుగునేల అనేదొక్కటే మా భావన. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదు. రాజధాని లేని రాష్ట్రంగా మనం ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాం. ఏపీ నేలపై ప్రేమతోనే ఎలాంటి షరతులు లేకుండా టీడీపీతో కలిశాం. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే కూటమిగా ఏర్పడ్డాం. వైసీపీ హయాంలో ఎక్కడ చూసినా అరాచకమే. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే మహిళలు భయపడేవారు. ప్రశ్నించిన అందరిపైనా దాడులు చేశారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని విభజించేటప్పుడు కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించ లేదని అన్నారు. రాష్ట్రం ఏర్పడే నాటికి సరైన కార్యాలయాలు లేవని, చంద్రబా బు బలమైన ఆశావాది కాబట్టి.. కార్యాలయాలు లేకపోయినా టెంట్ వేసుకొనైనా పని చేద్దామని ఆశిం చారన్నారు. రాష్ట్రం ఏర్పడి ఇన్నేళ్లయి నా.. ఇప్పటికీ రాజధాని కోసం కొట్టుకుంటున్నాం. ఇప్పటికీ రాజధా ని, సరైన హైకోర్టు లేదని తలచుకుంటే బాధేస్తోంది. అభివృద్ధికి రాజకీయ స్థిరత్వం చాలా ముఖ్యం. రాజధాని కోసం మెజార్టీ రైతులు ఇష్టపూర్వకంగానే భూములు ఇచ్చారు. ఎలాంటి గొడవలు లేకుండా 33వేల ఎకరాలు రాజధాని కోసం సేకరించారు. 2019లో ప్రభుత్వం మారాక.. అమరావతిపై కక్ష కట్టారు. అమరావతి రైతులకు మద్దతుగా నేను వెళ్తే.. ముళ్ల కంచెలు వేశారు. వైకాపా హయాంలో శాసన సభ్యులకే రక్షణ లేకపోతే.. రైతులకు ఎలా ఉంటుంది? రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వైకాపా హయాంలో హింసించారు. వైకాపా హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన చేశారు. రాజధాని సమస్యను పరిష్కరించకపోగా.. కఠినం చేశారు. వైకాపా మళ్లీ వస్తే.. పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. వైకాపా మళ్లీ రాదు.. వచ్చినా ఏం చేయలేదు. అమరావతి రైతుల కోసం మనమంతా ఒకే మాటపై ఉండాలని అన్నారు. అమరావతిపై జనసేన ఎప్పుడూ మాట మార్చదు. దీనికి కట్టుబడి ఉన్నాం. చట్టసభల్లో కూర్చొని దాడులు చేస్తామంటే.. చూస్తూ ఊరుకోం అన్నారు. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వం ఉంటేనే.. పెట్టుబడులు వస్తాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేటప్పుడు చంద్రబాబును అందరూ విమర్శించారు. ప్రపంచబ్యాంకుతో కుమ్మక్కయ్యారని ఆరోపించేవాళ్లు. రాజకీయ నేత ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. దార్శ నికుడు ఒక తరం గురించి ఆలోచిస్తాడని పవన్ అన్నారు.

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే...

(మొదటి పేజీ తరువాయి)

నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచ్‌ఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బడ్జెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బడ్జెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్ ఎ÷-లాన్ నిధుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# కంచె చేను మేసినట్లుగా ఉంది

**హైదరాబాద్,మార్చి28 :**అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్మ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్టక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్ రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు.

# చిన్నారులకు పౌష్టికాహారం తొలిముద్ద

**హైదరాబాద్,మార్చి28 :** దేశంలో ప్రస్తుతం ఆహారభద్రత ఉంది కానీ, పౌష్టికాహారం అందట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద 'తొలిముద్ద' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రెడీ టూ కుక్ ఫుడ్ ఉప్మా, కిచిడీ మిక్స్ ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ అమలు చేయడం వెనుక సహేతుక కారణం ఉందన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టికాహారం అందిస్తున్నాం. పిల్లలకు పౌష్టికాహారం అందితేనే మానసిక ఎదుగుదల ఉంటుందన్నారు. అంగన్వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబసభ్యుల్లా భావిస్తోంది. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నాం. అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు. సొంత భవనాలు నిర్మించే చర్యలు చేపట్టాం. సమతులాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని సీఎం అన్నారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దేశంలో ప్రస్తుతం ఆహార భద్రతఉంది.. కానీ పౌష్టికాహారం అందడం లేదు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోంది. అందుకే తాజాగా బ్రేక్ ఫాస్ట్ స్కీంను కూడా ప్రారభించాము. ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా.. అమలు చేయాల్సింది అంగన్వాడీ టీచర్లు మాత్రమే. అందుకే ఈ ప్రభుత్వం మీపై గురుతర బాధ్యత పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్లు సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. అంగన్వాడీ భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తామని అంగన్వాడీలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ సీతా దయాకర్‌రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీసీతరామ పట్టాభిషేకం

**భద్రాచలం,మార్చి28 :** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో జయ జయ నీరాజనాల మధ్య దేవదేవుడికి అర్చకులు సమస్త నదీ జలాలతో అభిషేకం చేశారు. ఈ పుణ్య జలాన్ని భక్తులపై చిలకరించి సమస్త లోకాలు శుభాలతో వర్ధిల్లాలని ఆశీస్సులు పలికారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు.

# విజయవాడలో ఐజెయూ ప్లీనరీ

(మొదటి పేజీ తరువాయి)

నిమ్మల రామానాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. మీడియాతో తనకు మంచి సంబంధం ఉందన్నారు. 1996లో ప్రెస్ అకాడమీ ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో జర్నలిజం బాగా మారిపోయింది. రాజకీయపార్టీలకు మీడియా సంస్థలు ఉండటం ప్రమాదం. ఫేక్ న్యూస్ ప్రమోషన్ డేంజరస్ ట్రెండ్‌గా మారింది. అసలైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇస్తాం అని అన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ.. జర్నలిస్ట్ యాక్సిడెంట్ పాలసీని పునరుద్ధరించాలన్నారు. ఇళ్లస్థలాల అంశంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. 15 రాష్ట్రాల్లో రిటైర్డ్ జర్నలిస్టులకు పెన్షన్ వస్తోందని, ఏపీలోనూ అవకాశం మేరకు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కె. శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్-2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్‌ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి.

TO-DAY TELANGANA
Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక
నిజం మా నైజం

# ఐపీఎల్ బెట్టింగులపై ప్రత్యేక నిఘా.. ప్రమోట్ చేసే వారిపై కఠిన చర్యలు.

**హైదరాబాద్ :** క్రికెట్ అభిమానులకు కిక్కిచ్చే ఐపీఎల్ 19వ సీజన్ ప్రారంభం కానుంది. ప్రతి ఏడాదిలాగే ఈ సారి క్రికెట్ ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగి ంచేందుకు రంగం సిద్ధమైంది. బెంగళూరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య ఓపెనింగ్ మ్యాచ్‌తో ఐపీఎల్ సంబురం మొదలుకానుంది. దాదాపు రెండు నెలలపాటు ఐపీఎల్ లీగ్ అభిమానులను అలరించనుంది. ఇక క్రికెట్ అభిమానులతో పాటు బెట్టింగ్ రాయుళ్లు కూడా ఐపీఎల్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏడాది బెట్టింగ్ ద్వారా వేల కోట్లు చేతులు మారుతుంటాయి. ముఖ్యంగా యువత ఎక్కువగా బెట్టింగులకు పాల్పడి అప్పులపాలవుతున్నారు. ఈనేపథ్యంలో బెట్టింగ్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి బతుకును ఛిద్రం చేసుకోవద్దని సూచించారు.'ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాల



ను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. గతంలో ప్రచారం ద్వారా వందలాది యాప్‌లన ం ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్‌హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంది. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండి.' అని సీపీ సజ్జనార్ ట్విట్టర్ ఎక్స్ వేదికగా కోరారు.కాగా, నేటి నుంచి మే 24 వరకు లీగ్ దశలో మట్నుత్తం 70 మ్యాచ్‌లు జరగనున్నాయి. మే 31న ఫైనల్ జరగనుండగా.. ప్లే ఆఫ్స్‌కు సంబంధించిన తేదీలు, వేదికలు ఖరారు కావాల్సి ఉంది. 18 రాయల్ చాలెంజర్స్ బెంగళూరు టైటిల్స్ సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఇప్పటికే చేరో ఐదు టైటిల్స్ ఖాతాలో వేసుకోగా.. ఈ ఏడాది కప్పు గెలిచి సిక్సర్ కొట్టాలని భావిస్తున్నాయి. కోల్‌కతా నైట్‌రైడర్స్ 4వ టైటిల్‌పై కన్నేయగా.. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, గుజరాత్ టైటాన్స్ రెండో కప్పు కోసం తహతహలాడుతున్నాయి. పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ తొలి టైటిల్ నిరీక్షణకు తెరదించాలని యోచిస్తున్నాయి. మరి, ఈ సీజన్ ఛాంపియన్ ఎవరో మే 31న తేలిపోనుంది.

# ఎర్త్ అవర్.. హైదరాబాద్ వాసులకు జీహెచ్ఎంసీ పిలుపు



**హైదరాబాద్, మార్చి 28:** ఎర్త్ అవర్ 2026లో పాల్గొనాలని నగరవాసులకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పిలుపునిచ్చింది. ఈ ఏడాది ఎర్త్ అవర్ కార్యక్రమం (శనివారం) రాత్రి 8:30 గంటల నుంచి 9:30 వరకు నిర్వహించనున్నారు. ఈ ఒక గంటలో లైట్లు ఆఫ్ చేయాలని ప్రజలకు జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేసింది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఎర్త్ అవర్ కార్యక్రమం జరుగనుంది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అవసరం లేని అన్ని విద్యుత్ దీపాలను స్వచ్ఛందంగా ఆఫ్ చేయాలని నగరవాసులకు సూచించారు.అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పచ్చదనం పెంపు, సస్టైనబుల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలని, వాతావరణ మార్పులకు స్పందించే నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రజలు, సంస్థలు, విద్యాసంస్థలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. పర్యావరణ హిత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం చాలా అవసరమని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు. ఒక గంటలో లైట్లు ఆఫ్ చేయడం ద్వారా విద్యుత్ ఆదా చేయడంతో పాటు, పర్యావరణ సంరక్షణకు మనమంతా ఒక్కటిగా కృషి చేద్దామని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి చేశారు.

# మెదక్: పోగొట్టుకున్న నగల బ్యాగును.. 2 గంటల్లో తెచ్చి ఇచ్చిన పోలీసులు



**మెదక్ జిల్లా :** మనదని రాసుంటే.. కాస్త అదిగో, తరిగో తిరిగి మనవద్దకే చేరుతుంది.. అదేదో సినిమాలో కమెడియన్ రఘుబాబు నోటి నుంచి వచ్చిన ఫన్నీ డైలాగ్ ఇది. అచ్చం ఇలాంటి ఘటనే మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో ఓ జంట.. తమ నగల బ్యాగ్ పోగొట్టుకుంది. బైక్ మీద వెళ్తున్న సమయంలో నగలతో ఉన్న బ్యాగ్ చేజారిపోయింది. అయితే ఈ విషయాన్ని గమనించకుండా ఆ దంపతులు ముందుకు వెళ్లిపోయారు. కొంచెం దూరం వెళ్లిన తర్వాత బ్యాగ్ పోయిన విషయాన్ని గుర్తించి ఆందోళనకు గురయ్యారు. ఆ తర్వాత వెంటనే అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కూడా అంతే వేగంతో స్పందించటంతో.. ఆ నగల బ్యాగు తిరిగి వారివద్దకే క్షేమంగా చేరింది. రెండు గంటల్లోనే పోయిన నగల బ్యాగును బాధితుల వద్దకు చేర్చిన తూప్రాన్ పోలీసులపై ప్రశంసలు కురుస్తున్నాయి.ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పరిధి లోని అల్లాపూర్ గ్రామంలో ఉండే నరసింహు లు అనే వ్యక్తి, తన భార్యతో కలిసి కుమార్తె దగ్గరకు వెళ్తున్నారు. 9 తులాల బంగారం తీసుకుని, రెండు బ్యాగులతో బైక్ మీద కుమార్తె దగ్గరకు బయల్దేరారు. అయితే బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ సమీపంలో ఓ స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో.. వీరు తీసుకెళు న్న నగల బ్యాగు బైక్ మీద నుంచి కిందకు పడిపోయింది. ఈ విషయాన్ని గమనించకుండా నరసింహులు దంపతులు చాలా దూరం అలాగే వెళ్ళిపోయారు. మార్గ మధ్యలో బ్యాగ్ పోయిన సంగతిని గుర్తించారు. ఆ వెంటనే అప్రమత్తమై డయల్ 100కు ఫోన్ చేసి అసలు విషయాన్ని చెప్పారు.బాధితుల ఫిర్యాదుతో సీఐ రంగాకృష్ణ, ఎస్ఐ గంగరాజులు వెంటనే రంగంలోకి దిగారు. సీసీ కెమెరాల ఆధారంగా నగల బ్యాగు బైక్ మీద నుంచి కిందపడిన సమయంలో అటుగా వెళ్లిన వారిని పరిశీలించారు. ఈ సమయంలోనే నాగరాజు, కృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు ఆ బ్యాగును తీసుకున్నట్లు గుర్తించారు. అయితే పోలీసులు వారి వద్దకు వెళ్లేసరికి.. అలాగే నిజాయితీ తమకు దొరికిన బ్యాగును అప్పగించి, సన్మానించారు. వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

# అసెంబ్లీలో మైనింగ్ అంశంపై వాడివేడి చర్చ... హరీశ్ రావు సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, మార్చి 28:** తెలంగాణ అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు. రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్ట్రక్షన్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని మాజీ మంత్రి తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు.ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని



అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి మీరు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌజ్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌజ్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌజ్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు.మంత్రి శ్రీధర్ బాబు సీరియస్‌హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారు: సీతక్కహరీష్ రావు అసలు ఉద్దేశ్యం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశ్యపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేండ్ల అక్రమాలపై విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ. . పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేండ్లు అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌజ్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు.హరీశ్ నీ వ్యాఖ్యలు వెనక్కి తీసుకో: మంత్రి శ్రీధర్‌వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆర్ఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆ కంపెనీలో మంత్రి డైరెక్టర్ కాదని.. చైర్మన్ కాదని.. ఆ కంపెనీతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాపారం ఉంటే తప్పా అని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీ తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# పుష్కలంగా యూరియా నిల్వలు, ఇక నో టెన్షన్

**హైదరాబాద్, మార్చి 28:**తెలంగాణలో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు కేంద్రం తీపి కబురు చెప్పింది. యూరియా సరఫరాపై కీలక అప్డేట్ ఇచ్చింది. ప్రస్తుతం దేశంలో యూరియా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చెప్పింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయంగా ఎరువుల సరఫరా వ్యవస్థపై నీలినీడలు కమ్ముకునేలా చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో యూరియా ధరలు 12 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగినప్పటికీ.. దేశీయంగా ఎరువుల ధరలను పెంచే ప్రసక్తే లేదని కేంద్రం స్పష్టం చేసింది. రానున్న వానాకాలం సీజన్ ప్రారంభం వరకు దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా 61.14 లక్షల టన్నుల



యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పింది. ఇది గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే దాదాపు 5.92 లక్షల టన్నులు అధికం. యుద్ధం కారణంగా సరఫరా గొలుసు దెబ్బతిన్నప్పటికీ.. ముందస్తు ప్రణాళికతో వ్యవహరించడం వల్ల ఓడరేవులకు ఇప్పటికే 10 లక్షల టన్నుల యూరియా చేరుకుంది. దేశీయంగా యూరియా ఉత్పత్తి కూడా 23 శాతం పెరిగి, రోజుకు 67,000 టన్నులకు చేరడం గమనార్హం. ఎరువుల తయారీ కేంద్రాలకు సహజ వాయువును నిరంతరాయం గా సరఫరా చేయాలని కేంద్రం ఆదేశించిం ది.భారతదేశం తన యూరియా అవసరాల కోసం ప్రధానంగా పశ్చిమాసియా దేశాలపై ఆధారపడుతుంది. ముఖ్యంగా తయారీకి అవసరమైన సహజ వాయువులో 41 శాతం ఖతార్ నుంచే వస్తుంది. అలాగే ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా వంటి దేశాల నుండి దిగుమతులు నిలిచిపోవ డంతో.. కేంద్రం ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. రష్యా, బెలారస్, మొరాకో, అమెరికా, కెనడా మరియు నైజీరియా వంటి దేశాల నుండి ఎరువులు, గ్యాస్ కొనుగోలుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. మే నెల వరకు ఇబ్బంది లేకపోయినా.. జూన్ నుంచి పెరిగే డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టింది.తెలంగాణ కూడా ఈ విషయంలో అప్రమత్తమైంది. రాష్ట్రంలో వానాకాలం సీజన్‌కు సుమారు 10.50 లక్షల టన్నుల యూరియా అవసరమవుతుంది. ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడ సీజన్ ముందుగానే ప్రారంభం కావడంతో.. ఏప్రిల్ నుంచే బఫర్ స్టాక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. జూన్ తర్వాత తలెత్తే డిమాండ్‌ను తట్టుకోవడానికి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నెలకు 2 లక్షల టన్నుల చొప్పున యూరియా కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు లేఖ రాశారు.

# పాత పద్ధతిలో మెడికల్ బోర్డు నిర్వహించాలి'




**రుద్రంపూర్, మార్చి 28 :** సింగరేణి కార్మికుల కుటుంబాల జీవన సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి కొండ మల్లికార్జున రావు అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి కార్మికుల మెడికల్ అన్‌ఫిట్ కారణంగా సంస్థపై ఆర్థిక భారం పడుతోందని చేసిన వ్యాఖ్యలు కార్మిక వ్యతిరేకమని ఆయన అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ శనివారం కొత్తగూడెం ఏరియాలోని పివికే-5 గని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఆధ్వర్యంలో కార్మికులు శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. కార్మికులు మొఖాలకు నల్ల రిబ్బన్లు కట్టుకుని ప్లకార్డులతో ఆందోళన చేపట్టి, అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆ వ్యాఖ్యలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ నాయకులు సింగరేణి ప్రధాన ఎదుట దొంగ నిరసన చేపట్టడం ఆశ్చర్యకరమని విమర్శించారు.

# ఈఎంసీ బడ్జెట్ రూ.72.34 కోట్లు




**ఖమ్మం రూరల్, మార్చి 28 :** 2026-27 సంవత్సరానికి గాను ఏదులాపురం మున్సిపాలిటీ కౌన్సిల్ అంచనా బడ్జెట్ రూ.72.34 కోట్లుగా ప్రకటించడం జరిగింది. శనివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత అధ్యక్షతన జరిగింది. 2026- 27 సంవత్సరానికి గాను అంచనా బడ్జెట్‌ను అందుకు సంబంధించి ఖర్చుల వివరాలను తెలుపుతూ మున్సిపల్ కమిషనర్ మున్వర్ అలీ బడ్జెట్ ప్రతిపాదనలో పాలకవర్గం ముందుంచారు. ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను పాలకవర్గ సభ్యులకు అందజేశారు. సాధారణంగా ఏ పాలకవర్గ బడ్జెట్ అయినప్పటికీ ప్రస్తుత బడ్జెట్ కు వచ్చే ఏడాది బడ్జెట్ కు కొంత శాతం అంచనాలను పెంచుతూ అంచనా బడ్జెట్ నివేదికను తయారు చేయడం జరుగుతుంది. 2025- 26 సంవత్సరానికి సంబంధించి ఇదే మున్సిపాలిటీ బడ్జెట్ రూ 9.71 కోట్లుగా ఉంది. పూర్తి నివేదిక ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.9.19 కోట్లు. వివిధ అభివృద్ధి పనులు ఉద్యోగుల జీతభత్యాలకు ఇతర అవసరాలకు ఖర్చులు పోగా రూ.51.28 లక్షలు మాత్రమే మిగిలి ఉంది.

# కేటీఆర్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్:** తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు మంత్రి.బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ చురకలు అంటించారు మంత్రి వాకిటి శ్రీహరి. తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు. కాగా, నేటి నుంచి రెండ్రోజులపాటు జరిగే లెజిస్లేచర్ స్పోర్ట్స్ మీట్-2026లో తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పాల్గొనరంటూ ఎమ్మెల్యే కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు.ప్రజా సమస్యలపై చర్చించకుండా క్రీడా పోటీలు అవసరమా? అంటూ ప్రశ్నించారు కేటీఆర్. శాసనసభ సమయం వృథా చేయడం తగదని.. కనీసం ఇంకో 10 రోజులు సమావేశాలను కొనసాగించాలని అన్నారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి స్పందిస్తూ పైవిధంగా కౌంటర్ ఇచ్చారు. కాగా, ఈరోజు మధ్యాహ్నం హైదరాబాద్ ఎల్బీ స్టేడియం వేదికగా ప్రజాప్రతినిధులకు క్రీడా పోటీలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

TO-DAY TELANGANA
Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక
నిజం మా నైజం

## అమరావతి ఉద్యమంలో మహిళల పోరాటంపై హోంమంత్రి ప్రశంసలు




**అమరావతి, మార్చి 28:** అమరావతి శాతకర్ణి పాలనలో మహిళలకు ఎంతో గౌరవం దక్కిం దని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శాసనసభలో హోంమంత్రి మాట్లాడుతూ... అమరావతిని వైసీపీ వారు 'వేశ్యల రాజధాని' అని అవమానకరంగా వ్యాఖ్యానించడం ఎంతో బాధించిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా అమరావతి రైతులు 1631 రోజుల పాటు పోరాడారని తెలిపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఇది అత్యంత సుదీర్ఘ కాలం జరిగిన పోరాటం అని వివరిం చారు. ఈ ఉద్యమంలో చంటి బిడ్డలను ఎత్తుకు'ని, గర్భిణీలు, వృద్ధ మహిళలు కూడా రోడ్డు పైకి వచ్చి పోరాడారని హోంమంత్రి గుర్తు చేశా రు.ఆనాటి రైతులు చేసిన ఆ మహా పోరాటాన్ని కొనసాగించేలా ఈనాటి అసెంబ్లీ తీర్మానం ఉంటుందని అనిత అన్నారు. అమరావతిని కాపాడుకున్న ఈ చరిత్ర భావితరాలకు తెలియాలన్నారు. ఉద్యమ సమయంలో మహిళలపై పోలీసులు దాడి చేశారని, వారిని కొట్టారని, జుట్టు పట్టుకుని లాక్కెళ్లారని, బూటుకాళ్లతో తన్నారని హోంమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు అనుమతితో పాదయాత్ర చేస్తున్నప్పటికీ పోలీసులు అడ్డుకుని ఇబ్బందులు పెట్టారని తెలిపారు. మహిళలు కట్టుకున్న చీరలపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని అనిత ఆరోపించారు.మహిళల పోరాటానికి మద్దతు ఇచ్చిన వారి ఆర్థిక మూలాలను దెబ్బతీశారని హోంమంత్రి మండిపడ్డారు. రైతులు పాదయాత్రలో భోజనం చేసే సమయంలో టెంట్లు కూల్చివేశారన్నారు. దీంతో మట్టిలో, రోడ్లపై కూర్చుని రైతులు అన్నం తినాల్సిన దారుణ పరిస్థితులు సృష్టించారని విమర్శించారు. ఇలాంటి అనేక దారుణాల నుంచి అమరావతిని మళ్లీ సాధించుకున్నామన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలు కూడా అమరావతికి మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. మహిళా రైతుల ఉద్యమాన్ని గుర్తు చేసుకుని ఈరోజు అసెంబ్లీలో అమరావతి తీర్మానానికి పూర్తి ఇస్తున్నట్లు హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## అమరాతి రాజధాని బిల్లుపై ఢిల్లీకి అడుగులు: మంత్రి లోకేశ్ కీలక ప్రకటన

**అమరావతి, మార్చి 28:**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత ఐదేళ్లుగా అనిశ్చితిగా ఉన్న రాజధాని అంశం ఇప్పుడు ఒక నిర్ణయాత్మక దశకు చేరుకుంది. అమరావతిని ఏకైక రాజధానిగా సుస్థిరపరిచే దిశలో కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, కేంద్ర ప్రభుత్వం ద్వారా అమరావతికి తిరుగులేని చట్టబద్ధత కల్పించడమే లక్ష్యంగా ఢిల్లీ వేదికగా రాజకీయ వ్యూహం సిద్ధమైంది. ఈ క్రమంలోనే రాజధాని అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక బిల్లును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో మంత్రి నారా లోకేష్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు.మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. 'అమరావతి రాజధాని బిల్లు నేడు ఢిల్లీకి చేరుకుంటుంది. ఏప్రిల్ 1వ తేదీన కేంద్ర మంత్రి వర్గం ఈ బిల్లుపై చర్చించి, ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఏప్రిల్ 2వ తేదీన ఈ కీలక బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ సభ్యులు హాజరు కాలేదు. కేవలం 11 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, వారు ప్రజల గొంతుకను వినిపించడంలో విఫలమవుతున్నాం'. అసెంబ్లీలోనే బిల్లును ఎదుర్కోవాల్సిన బాధ్యత వైసీపీపై ఉంది. కానీ వారు సభకు రాకపోవడం చూస్తుంటే అమరావతిపై వారికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది. పార్లమెంట్‌లో ఈ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు వైసీపీ ఎంపీలు ఏం చేస్తారో చూడాలి. 'బ్లూ బుక్' నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరికీ ప్రోటోకాల్ ఇవ్వాల్సిందే. గత ప్రభుత్వంలో చంద్రబాబు పాదయాత్ర చేసినప్పుడు జగన్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోలేదు. సినిమా చూపిస్తా.. అన్న జగన్ సినిమా ఎలా ఆడిందో రాష్ట్ర ప్రజలకు తెలుసు. వైసీపీకి ఉన్న 11 సంఖ్యను దృష్టిలో ఉంచుకొని సరిగ్గా ఉదయం 11 గంటలకు ముహూర్తం చూసి మరీ అసెంబ్లీలో రాజధానిపై తీర్మానాన్ని ప్రవేశపెట్టాం' అని లోకేశ్ అన్నారు.ఇది చారిత్రక తీర్మాణం. మంత్రి నారాయణ భావోద్వేగం. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ తర్వాత రాష్ట్రానికి ఎదురైన అతిపెద్ద సవాలు రాజధాని నిర్మాణం. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి పాలకులు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారంటూ మంత్రి నారాయణ మండిపడ్డారు. రాజధాని అంశంపై అసెంబ్లీలో ప్రసంగిస్తూ.. విభజన నాటి ఛేదు జ్ఞాపకాలను, అమరావతి ఎంపిక వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను విశ్లేషించారు.మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'రాష్ట్రాన్ని విడగొట్టినప్పుడు ఏపీకి కనీసం ఒక రాజధాని నగరం లేకుండా చేశారు. విభజన చట్టం ప్రకారం పదేళ్లపాటు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కేటాయించినప్పటికీ, సొంత గడ్డపై పరిపాలన సాగించాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నాం. అప్పట్లో రాజధాని ఎంపిక కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ రాష్ట్రమంతా పర్యటించి ప్రజలు అభిప్రాయాలు సేకరించింది. కమిటీ సేకరించిన అభిప్రాయాలలో మెజారిటీ ప్రజలు విజయవాడ-గుంటూరు మధ్యే రాజధాని ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రానికి మధ్యలో ఉండటం, పోర్టులకు, జాతీయ రహదారికి దగ్గరగా ఉండేలా చూశాం. రాజధానికి సరిపడా భూమి లేకపోవటంతో భూ సమీకరణకు వెళ్లాం. కానీ, ప్రతిపక్ష నేతలు ఇక్కడ రాజధాని వద్దని ప్రజల్ని రెచ్చగొట్టారు. భూకంపాలు, ముంపు, భూమి పనికిరాని తప్పుడు ప్రచారాలు చేశారు. కొంతమంది రైతుల పొలాలు తగులబెట్టి భయపెట్టారు. అన్ని వర్గాల ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ ప్రాంతాన్ని ఖరారు చేశాం' అని అన్నారు.



## జగన్ మాటలు మోసం కుట్ర నయవంచనకు ప్రతిరూపం



**అమరావతి, మార్చి 28:** వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాటలు మోసం, కుట్ర, నయవంచనకు ప్రతిరూపంగా కనిపిస్తున్నాయని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జగన్‌కు అధికారం తప్ప ప్రజల ఆకాంక్షలు కనిపించవంటూ మండిపడ్డారు. తెలుగుజాతికి చరిత్రలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. రాష్ట్ర విభజన జరుగుతున్న సమయంలో తమలాంటి వారు ఆ సభలో ఉన్నారని, తెలుగుజాతి బాగుండాలని చంద్రబాబు పడిన తపన తాము చూశామని చెప్పుకొచ్చారు. చంద్రబాబు ఎప్పుడూ నిబ్బరం కోల్పోలేదని తెలిపారు.ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'సీఎంగా ఉండి కూడా బస్సులో పడుకున్నారు. ఈ కార్యాలయాన్ని సీఎం కార్యాలయంగా చేసుకుని పని చేశారు. 53 సంవత్సరాలు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న వ్యక్తి చంద్రబాబు. అవతల వైపు ఎంతమంది మారినా.. ఇటువైపు చంద్రబాబు ఒక్కరే నిలబడ్డారు. రాష్ట్రం కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. 1995-2004 మధ్య చంద్రబాబు తెచ్చిన 63 ప్రాజెక్టుల్లో.. 2004 తర్వాత వైఎస్ 62 ప్రాజెక్టులను కొనసాగించారు. కానీ, జగన్ మాత్రం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలన్నింటినీ తిరగదోడారు'.'జగన్ సొంతంగా ఒక్క ప్రాజెక్టు తెచ్చింది లేదు. ఒక్క ఇటుక పెట్టి పని చేసింది లేదు. రాష్ట్రం ఒక్కటిగా ఉండాలని ప్రజలు చేసిన పోరాటం మా కళ్ల ముందు ఉంది. విభజన కష్టాలతో ఉన్న సమయంలో నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం మేం పని చేశాం. కానీ జగన్ మాత్రం ఎలా ఆలోచించారో ఈ వీడియోల ద్వారా ప్రజలు చూశారు. జగన్ 3 రాజధానులకు అప్పటి సభ్యులు చప్పట్లు కొట్టారు. కేవలం బటన్ నొక్కడంతోనే ప్రజల బతుకులు సాగాలని జగన్ కోరుకున్నారు. సింగపూర్ మాస్టర్ ప్లాన్‌తో లక్షన్నర ఉద్యోగాలు వస్తాయి. జగన్ మాత్రం పురిట్లో బిడ్డను చూశారు'..'చంద్రబాబు, పవన్ కల్యాణ్ అమరావతిని నిలబెట్టేందుకు కృషి చేశారు. కావాలంటారు.. మరోవైపు అమరావతిలోనే ఖర్చు చేస్తున్నారని ప్రచారం చేస్తారు. రాజధాని అంటే కేవలం నాలుగు భవనాలు కాదు. రాజధాని గ్రోత్ ఇంజిన్‌లా ఉండాలని చంద్రబాబు భావించారు. హైదరాబాద్ విషయంలో ఇదే విషయం రుజువైంది. అదే తరహా నగరం ఏపీ రాజధానిగా ఉండాలని చంద్రబాబు భావించారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలోని యువకులకు సైతం మాకు మంచి రాజధాని ఉందనుకునేలా చేశారు. రెండున్నరేళ్లపాటు అమరావతి నిర్మాణ పనులు పరుగులు తీశాయి' అని అన్నారు

## విజయవాడలో దారుణం యువతిపై అత్యాచారం చేసిన ఆటో డ్రైవర్



**విజయవాడ:** దేశవ్యాప్తంగా మహిళలపై అత్యాచారాలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. ప్రతి రోజూ ఏదో ఒక చోట వారిపై కామాంధులు లైంగిక దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. చిన్న, పెద్ద, వృద్ధులు అనే తేడా లేకుండా కామవాంఛలు తీర్చుకుంటూ రెచ్చిపోతున్నారు. ఒంటరిగా చిక్కితే పాపం.. అత్యాచారాలకు తెగపడుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే ఒకటి విజయవాడలో జరిగింది. ఆటో ఎక్కిన యువతిపై డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. యువతి వెళ్లాల్సిన ప్రాంతానికి కాకుండా బలవంతంగా కృష్ణలంక వైపునకు తీసుకెళ్లాడు కామాంధుడు. భయభ్రాంతులకు గురి చేసి ఎవరూ లేని ప్రదేశానికి లాక్కెళ్లాడు.అనంతరం యువతిపై అత్యాచారానికి ఒడికట్టాడు. ఆ తర్వాత ఆమెను అక్కడే వదిలిపెట్టి ఆటోతో సహా పరారయ్యాడు. ఏడుస్తూ ఇంటికి వెళ్లిన బాధితురాలు జరిగిన విషయం తల్లికి చెప్పింది. షాక్‌కు గురైన బాధిత కుటుంబం మాచవరం పోలీసులను ఆశ్రయించారు. తనపై జరిగిన లైంగిక దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసింది సదరు యువతి. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. కాగా, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను నగర వాసులు కోరుతున్నారు. కాకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని ఏపీ అసెంబ్లీలో సుధీర్ఘ చర్చ




**అమరావతి :** ఏపీ రాజధానిగా అమరావతి కి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ కూటమి ప్రభుత్వం శనివారం అసెంబ్లీ ( ) ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు() రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.ఏపీ ప్రభుత్వం అమరావతి రాజధాని అంశంపై అసెంబ్లీలో తీర్మాణం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపింది. అయితే కేంద్రం కొన్ని సవరణల చేసి మరోసారి అసెంబ్లీ సమావేశం తీర్మానం చేసి పంపాలని ఇటీవల కేంద్రం ఏపీకి సూచించింది. ఈ మేరకు శనివారం జరిగిన సమావేశంలో విభజన చట్టంలోని సెక్షన్ 5లోని సబ్‌సెక్షన్ 2లో 'ఎట్ అమరావతి ' పదం చేర్చాలని , సీఆర్‌డీఏ -2014 ప్రకారం క్యాపిటల్ సిటీ ప్రాంతాలతో సహా అమరావతిని చేర్చాలని కోరుతూ తీర్మానంపై సుధీర్ఘంగా చర్చ జరిగింది. అసెంబ్లీ సమావేశంలో దాదాపు 20 మంది సభ్యులు మాట్లాడారు.స్పీకర్‌తో పాటు మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, వంగలపుడి అనిత, నారా లోకేష్, విష్ణు కుమార్ రాజు, తదితరులు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏపీ సర్వనాశనం అయిందని ఆరోపించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా వైఎస్ జగన్ కుట్ర చేశారని విమర్శించారు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని , అభివృద్ధి వికేంద్రీకరణే తమ విధానమని మంత్రి లోకేష్ అన్నారు.

## సరిగ్గా 11:11 నిమిషాలకు అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టిన చంద్రబాబు




**అమరావతి, మార్చి 28:** ఏపీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం(శనివారం) ఉదయం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడురాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లును ప్రవేశపెట్టారు. ఉదయం సరిగ్గా 11 గంటల 11 నిమిషాలకు శాసన సభలో ఈ బిల్లును సీఎం ప్రవేశపెట్టడంతో తీర్మానంపై చర్చ మొదలైంది. తీర్మానంపై 20 మందికి పైగా సభ్యులు మాట్లాడనున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ చర్చలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. ఈ శాసనసభ సమావేశానికి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు.రాష్ట్ర ప్రగతికి ఎదురయ్యే సవాళ్లను అధిగమించే యజ్ఞం ఈ సమావేశంతో మొదలవుతోందని స్పీకర్ అన్నారు. 2014లో నడిసంద్రంలో చుక్కాని లేని నావలా ఆంధ్రప్రదేశ్ ఉందని.. అలాంటి సమయంలో దార్శనికుడు చంద్రబాబుకు రాష్ట్రాన్ని ప్రజలు అప్పగించారని తెలిపారు. చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపించాలని ప్రణాళికలు రూపొందించారన్నారు. అందరి సంప్రదింపులతో అమరావతిని రాజధానిగా ఖరారు చేశారని అన్నారు. ఈ ప్రాంతంలోని రైతులు తమ ప్రాణప్రద మైన భూములను రాజధా ని కోసం విరాళంగా ఇచ్చారని తెలిపారు. అన్నదాతల అండతోనే రాజధానికి భూమి లభించిందని... అమరావతి రాజధాని పనులు వేగంగా ముందుకు సాగాయని స్పీకర్ తెలిపారు. 2019 లో అమరావతికి అడ్డంకులు ఎదురయ్యాయ న్నారు స్పీకర్. మూడు రాజధా నుల పేరిట తప్పుడు నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారిన పుడు పాత నిర్ణయాలు కొనసాగించాలనే సూత్రానికి విరుద్ధంగా అప్పటి ప్రభుత్వం వ్యవహరించిం దన్నారు. చేతికి కొబ్బరికాయ చిక్కినట్లు ప్రవర్తించి, అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రం 50 ఏళ్లు వెనక్కు వెళ్లిందని వ్యాఖ్యానించారు. పాలకులు కూడా విధ్వంసానికి పాల్పడవచ్చని ఈ సంఘటనలు నిరూపించాయని స్పీకర్ వెల్లడించారు.అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తున్నారని స్పీకర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ధృడ సంకల్పం ఫలితంగా దీనికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించిందన్నారు. ఈ మేరకు అమరావతి రాజధానిగా తీర్మానం చేసేందుకు అవకాశం వచ్చిందని తెలిపారు. తెలుగు ప్రజలు గర్వించదగ్గ రోజు ఇది అని చెప్పుకొచ్చారు. ఈ చరిత్రాత్మక సమావేశానికి 11 మంది వస్తారని అనుకున్నామని... చేసిన తప్పును ఒప్పుకునే ధైర్యం వారికి లేదని తెలిసిపోయిందన్నారు. అమరావతి తీర్మానంపై జరిగే చర్చ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. 'ఇలాంటి చరిత్రాత్మక సందర్భంలో మాట్లాడే అవకాశం మీ అదృష్టం. అందరూ అర్థవంతంగా చర్చలో పాల్గొని మాట్లాడాలి' అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు..

## అమరావతికి చట్టబద్ధత మంచిదే కానీ.. జగన్ పేరు ప్రస్తావిస్తూ షర్మిల ఆసక్తికర ట్వీట్



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా తీర్మానం చేసేందుకు అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరుతూ తీర్మానం చేస్తారు. అనంతరం ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపిస్తారు.. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే అమరావతికి చట్టబద్ధతపై బిల్లును ప్రవేశ పెట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అమరావతికి చట్టబద్ధత అంశంపై స్పందించారు.. ఆసక్తికర విషయాలను ప్రస్తావించారు.అమరావతి చట్టబద్ధతకు అసెంబ్లీ తీర్మానం హర్షణీయమే అన్నారు వైఎస్ షర్మిల. సెక్షన్ 5 సవరణకు కేంద్రాన్ని కోరడం న్యాయబద్ధమేనన్నారు. మళ్లీ ఏ జగన్ వంటి వాళ్లు వస్తే పరిస్థితి ఏంటని భావించి ముందుచూపు ఉండడం చంద్రబాబు విజన్‌కి నిదర్శనం అనుకుంటే.. మరి రాజధాని కోసం విభజన చట్టంలో పెట్టిన సెక్షన్ 94(3) సంగతేంటి చంద్రబాబు గారూ అంటు ప్రశ్నించారు. 'సెక్షన్ 5 ( సబ్ సెక్షన్ 2)లో ఎట్ అమరావతి పదాన్ని పెట్టించేందుకు ఉన్న శ్రద్ధ.. సెక్షన్ 94(3) కింద అమరావతి ఫండ్స్ అడిగేందుకు లేదా? గెజిట్ తోనే అమరావతి గెయిన్ అవుతుందా? ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని నిర్మాణ భాద్యత కేంద్రానిదేనని తెలియదా?. ఎంతైతే అంత కేంద్రం నిధులు ఇవ్వాల్సిందే అనే క్లాజ్ సెక్షన్ 94(3ఎ) చదవలేదా ?' అంటూ షర్మిల ప్రశ్నించారు.కేంద్రం చేస్తున్న మోసంపై అసెంబ్లీ తీర్మానం వద్దా అంటూ ప్రశ్నించారు షర్మిల. నిధులు హక్కుగా ఇవ్వాల్సిందేనని తీర్మానం చేయొద్దా అన్నారు. విభజన చట్టానికి కేంద్రం తూట్లు పొడుస్తుంటే అసెంబ్లీ వేదికగా తీర్మానం చేయరా అన్నారు. ప్రధాని మోదీ ఇచ్చిన చెంబుడు నీళ్లు, తట్టెడు మట్టితో సరిపెట్టుకుందామా? అంటూ ప్రశ్నించారు. 'ఇదే బీజేపీ రాజధానికి ఇచ్చిన గొప్ప ప్రసాదంగా భావిద్దామా?. అసలొద్దు.. అప్పులిప్పిస్తే చాలని రాజీపడదామా?. పదో పరకో ముష్టిగా పడేస్తుంటే ఇప్పటికింతే సంతోషం అనుకుందామా?. అమరావతికి నిర్మాణానికి పట్టే రూ.1 లక్ష కోట్లు ప్రజల నెత్తిమీద వేద్దామా?. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన సంధిస్తున్న ప్రశ్నలపై కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అసెంబ్లీ వేదికగా సమాధానం చెప్పాలి' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు.

## ఏపీలో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు నయా రూల్స్.




**అమరావతి, మార్చి 28:**

రాష్ట్రంలోని ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా శాఖ కొత్త నిబంధనలు విడుదల చేసింది. ఈ నిబంధనల ప్రకారం కోచింగ్ సెంటర్లు రోజుకు గరిష్ఠంగా 5 గంటలు మాత్రమే తరగతులు నిర్వహించాలని ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. పాఠశాలలు, కాలేజీలు నడిచే సమయంలో, సెలవు రోజుల్లో కోచింగ్ తరగతులు నిర్వహించకూడదని పేర్కొంది. విద్యార్థులకు వారానికి ఒక రోజు(ఆదివారం) తప్పనిసరి సెలవు ఇవ్వాలనే నిబంధనను విధించింది.విద్యార్థి మధ్యలో కోర్సు మానేస్తే, మిగిలిన రోజుల ఫీజును తిరిగి చెల్లించాలని తెలిపింది. అలాగే విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను కోచింగ్ సెంటర్లు తమ వద్ద ఉంచుకోకూడదని స్పష్టం చేసింది. 50 మందికి పైగా విద్యార్థులు ఉన్న సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిసారి రూ.50 వేలు జరిమానా, రెండవసారి రూ. లక్ష జరిమానా విధించనున్నారు. ఫిర్యాదుల పరిష్కారం కోసం ఎస్పీ, డీఈవోలతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# బంగాల్‌లో రెండో అనుబంధ ఓటర్ల జాబితా విడుదల చేసిన ఈసీ

**బంగాల్:** బంగాల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విచారణ తర్వాత రెండో అనుబంధ ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం (ఈసీ) విడుదల చేసింది. శుక్రవారం అర్ధరాత్రి ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఈ జాబితాలను ఈసీ తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. వివరాలు వెల్లడించని ఈసీశుక్రవారం రాత్రి 11:30 గంటలకు వైబ్‌సైట్‌లో బూత్‌వారీగా ఓటర్ల వివరాలు అందుబాటులో ఉంచారు. కానీ చేర్పులు, తొలగింపులపై సమాచారం ఇవ్వలేదు. రెండో జాబితా విడుదల చేశామని, అంతకు మించి వరాలు చెప్పలేమని ఈసీ అధికారులు పేరొన్నారు. టెక్నికల్ సమస్యలు కారణంగా డేటా అందుబాటులో లేదని చెప్పారు. మరోవైపు ఎన్నికల కోసం బంగాల్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మొదటి జాబితాలోనూ సేమ్‌ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ తర్వాత బంగాల్‌లో తొలి సప్లిమెంటరీ ఓటర్ల జాబితాను ఈసీ మార్చి 23 (సోమవారం) రాత్రి విడుదల చేసింది. ఇందులో పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలను పొందుపరిచారు. ఈ జాబితాను ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అప్పుడు కూడా ఎంత మంది పేర్లు తొలగించారు, ఎంత మంది




కేసులు పరిష్కరించారనే వివరాలను ఇవ్వలేదు. దీంతో రాజకీయ వర్గాల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. ఫిబ్రవరి 28న ప్రచురించిన తుది ఓటర్ల జాబితాలోని దాదాపు 60 లక్షల మంది ఓటర్ల పేర్లపై దర్యాప్తు జరుగుతోందని ఈసీ తెలిపింది. వీటిపై విచారణ కోసం అప్పట్లో 705 మంది జ్యుడీషియల్ అధికారులను నియమించింది. ఈ అధికారులు క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేసి నకిలీ, అసలైన ఓటర్ల వివరాలను గుర్తించారు. స్క్రీనింగ్ పరిధిలో ఉన్న ఆ 60 లక్షల మంది ఓటర్లలో 29 లక్షల మందిపై విచారణ పూర్తయిందని బంగాల్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి మనోజ్ కుమార్ అగర్వాల్ సోమవారం సాయంత్రం వెల్లడించారు. ఈ ఓటర్ల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకోలేకపోత ున్నామని పలువురు అంటున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికార టీఎంసీ పార్టీ నుంచి విముఖ వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకూ ఈసీ విడుదల చేసిన రెండు అనుబంధ ఓటర్ల జాబితాలో ఎంతమంది పేర్లను జాబితాలో ఉంచారు, తొలగించారు అనే వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. రెండు దశల్లో పోలింగ్‌బంగాల్ అసెంబ్లీలో 294 స్థానాలకు ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ప్రధాన పోటీ టీఎంసీ, బీజేపీ మధ్య నెలకొంది. ఇప్పటికే వ్యూహాలను రచిస్తున్నాయి. ఈసారి ఎలాగైనా గెలిచి వరుసగ ా నాలుగోసారి బంగాల్‌లో అధికారాన్ని చేపట్టాలని టీఎంసీ ఉవ్విళ్లూరుతోంది. 2011, 2016, 2021లో జరిగిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమత బెనర్జీ నాయకత్వంలో టీఎంసీ వరుసగా మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టింది. ఇక వచ్చే నెలలో జరగనున్న ఎన్నికల్లోనూ అధికారాన్ని తిరిగి దక్కించుకోవాలని తృణమూల్ కాంగ్రెస్ కృషి చేస్తోంది. అందుకు తమ పార్టీకి అట్టడుగు వర్గాల్లో ఉన్న ఆదరణ, సంక్షేమ పథకాలు, ఎస్ఐఆర్‌పై పోరాటం కలిసి వస్తాయని ఆశిస్తోంది. ఇక 2021లో జరిగిన ఎన్నికల్లో మమతకు గట్టి పోటీ ఇచ్చిన బీజేపీ, ఈసారి అధికార పీఠం దక్కించుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. . 2001లో జరిగిన బంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ కేవలం ఐదు శాతం ఓట్లను సాధించింది. 2016లో 291 నియోజకవర్గాల్లో పోటీ చేసి కేవలం మూడు సీట్లునే గెలుచుకుంది. కానీ 2021లో అనూహ్యంగా పుంజుకుంది. ఈసారి ఏకంగా 77 స్థానాల్లో జయకేతనం ఎగురవేసింది. మరోవైపు, ఒంటరిగా బరిలోకి దిగి సత్తాచాటాలని కాంగ్రెస్ సిద్ధమవుతోంది.

# అన్నా వర్సిటీలో మళ్లీ లైంగిక వేధింపులు




**చెన్నై:** స్థానిక అన్నా విశ్వవిద్యాలయంలో ఓ ప్రొఫెసర్ లైంగిక వేధింపులకు పాల్పడుతు న్నారంటూ పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఓ విద్యార్థిని గురువారం సాయంత్రం చేసిన ఫిర్యాదులో వివరాలిలా ఉన్నాయి. వర్సిటీలోని ప్రొఫెసర్ తనను ప్రత్యక్షంగా, సెల్‌ఫోన్ ద్వారా అసభ్య మెసేజ్‌లు చేస్తూ లైంగికంగా వేధిస్తున్నాడని, తనను మాత్రమే కాకుండా, తన స్నేహితులు కొందరిపై కూడా ఇలాగే వ్యవహరిస్తున్నాడని తెలిపింది. ఈ విషయమై వర్శిటీలోని కమిటీకి ఫిర్యాదు చేశారని, ఈవ్యవహారంపై సత్వరం చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో కోరింది. విద్యార్థిని ఫిర్యాదుపై తగిన చర్యలు చేపట్టాలని అభిరామపురం మహిళా పోలీసు స్టేషన్‌కు పోలీసు కమిషనర్ అరుణ్ ఆదేశించారు. కోట్టూరుపురం పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థినిని మైలాపూర్ పోలీసు కమిషనర్ నేతృత్వంలో మహిళా పోలీసులు విచారిస్తున్నారు. లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్ జ్ఞానవేల్ బాబును సస్పెండ్ చేస్తున్నట్లు అన్నా విశ్వవిద్యాలయం ప్రకటించింది.. శాఖాపరమైన విచారణ చేపట్టిన నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపా రు. కాగా, విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రొఫెసర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని విద్యార్థి సంఘాలు శుక్రవారం వర్శిటీ ఎదుట ఆందోళనలు చేపట్టాయి .ప్రొఫెసర్ అరెస్ట్‌విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో ప్రొఫెసర్ జ్ఞానవేల్ బాబును పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం అన్నా వర్శిటీ విద్యార్థిని చేసిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. తిరునల్వేలిలో ఉన్న జ్ఞానవేల్ బాబును అరెస్ట్ చేసి,విచారణ నిమిత్తం నగరానికి తీసుకురానున్నట్లు పోలీసులు తెలిపారు.

# అప్పటి వరకు ఎరువుకు ఢోకా లేదు - యూరియా నిల్వలపై కేంద్రం క్లారిటీ



**న్యూ ఢిల్లీ :**మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధం ప్రభా వం భారత్‌లో యూరియా, ఇతర ఎరువుల పంపిణీపై అంతగా ఉండదని, రానున్న వర్షాకాలం సీజన్ ఆరంభం వరకు సరిపడా నిల్వలు ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది. ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు 12 శాతం నుంచి 40 శాతం వరకు పెరిగినప్పటికీ మన దేశంలో పెంపు ప్రసక్తే లేదని పేర్కొంది. అంతర్జాతీయంగా సప్లై చైన్?లో ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముందస్తు నిల్వలపై దృష్టి సారించడం వల్ల సంక్షోభ నివారణకు తోడ్పడుతోందని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను పంపింది. యూరి యా, ఇతర ఎరువుల నిల్వల స్థితిగతులపై అన్ని రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని, వాటి వాడకాన్ని క్రమబద్ధీకరించా లని, జీవ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాల ని కేంద్రం సూచించింది. ఇప్పటికే 61.14 లక్షల టన్నుల నిల్వలు : ప్రస్తుతం మన దేశంలో యూరియా నిల్వలు 61.14 లక్షల టన్నుల మేరకు ఉన్నాయి. ఇది గతేడాది ఇదే సమయంలో ఉన్న 55.22 లక్షల టన్నుల కంటే 5.92 లక్షల టన్నులు ఎక్కువ. మరోవైపు దేశీయ ఉత్పత్తి కూడా 23 శాతం పెరిగి, దినసరి 67,000 టన్నులకు చేరింది. యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ ఇటీవల ఓడరేవులకు 10 లక్షల టన్నుల మేర యూరియా చేరుకుంది. దేశీయ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెలాఖరు వరకు యూరియా దిగుమతుల అనుమతిని కేంద్రం పొడిగిం చింది. యూరియా ఉత్పత్తికి కీలకమైన సహజ వాయువును ఫెర్టిలైజర్ ప్లాంట్లకు నిరంతరం సరఫరా చేయాలని ఇటీవల కీలక ఆదేశాలు జారీ చేసింది. మన దేశంలో యూరియా తయారీ ప్రక్రియలో ఉపయోగించే సహజ వాయువులో 41 శాతం ఖతార్ నుంచే దిగుమ తి చేసుకుంటున్నాం. పశ్చిమ ఆసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఆ సరఫరా నిలిచిపోయి, ఉత్పత్తి తగ్గింది. దీంతో కేంద్రం రష్యా, మొరాకో, బెలారస్ తదితర దేశాల నుంచి ఎరువులు, ప్రయత్నిస్తోంది. దేశానికి యూరియా దిగుమతులు పశ్చిమాసియా దేశాలైన ఒమన్ (46%) నుంచి అత్యధికంగా, యూఏఈ(6%), సౌదీ అరేబియా(9%)ల నుంచి ఉంటాయి.

# మెడికల్ కాలేజీలో అగ్నిప్రమాదం- 27మంది నవజాత శిశువులను కాపాడిన డాక్టర్

**మధ్యప్రదేశ్:** మధ్యప్రదేశ్‌లోని ఓ మెడికల్ కాలేజీ అతి పెద్ద ప్రమాదం తప్పింది. నవజాత శిశువుల వార్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. అదే సమయంలో డ్యూటీలో ఉన్న వైద్యుడి సకాలంలో స్పందించి మంటలను ఆర్పివేయడం వల్ల 27 మంది శిశువులు సురక్షితంగా బయటపడ్డారుఅసలేం జరిగిదంటే?జబల్‌పుర్‌లోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో గురువారం అర్ధరాత్రి సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. నవజాత శిశువుల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) వద్ద ఉన్న వెయింటిఁగ్ ఏరియాలోని ఫ్యాన్‌లో షార్ట్ సర్క్యూట్‌కారణంగా మంటలు చెలరేగాయి. మొదట దట్టంగా పొగ వచ్చింది. కాసేపటికే అది ఎన్ఐసీయూ వార్డులోకి వ్యాపించింది. దీంతో ఆస్పత్రిలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది27 మంది శిశువులు ప్రమాదంలోగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఎన్ఐసీ యూ వార్డులో 27 మంది నవజాత శిశువులు చికిత్స పొందుతున్నారు. దీంతో వారి తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనకు గురయ్యా రు. కొందరు వార్డులోకి పరుగెత్తి వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే పొగను గమనించిన డ్యూటీలో ఉన్న డాక్టర్ వెంటనే స్పందించి ఫైర్? ఎక్స్ టింగ్విషంతో



మంటలను అదుపులోకి తీసుకొ చ్చారు. అలాగే సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి, మంటలు మరింత వ్యాపించకుండా అడ్డుకున్నారు. 27 మంది శిశువులను వెంటనే మరో వార్డుకు తరలిం చారు. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత ఎన్ఐసీయూలో చేర్చారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరవింద్ శర్మ స్పందించారు. ఫ్యాన్ నుంచి పొగ రావడం ప్రారంభమైన వెంటనే డ్యూటీలో ఉన్న డాక్టర్ ఫైర్ ఎక్స్‌టింగ్విషర్‌తో మంటలను ఆర్పివేసి నట్లు చెప్పారు. గతంలోనూ ప్రమాదాలుఈ మెడికల్ కాలేజీ నగరంలోనే అతిపెద్ద కేంద్రం. దీంతో జబల్‌పుర్ నుంచే కాకుండా చట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా ప్రజలు చికిత్స కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ మెడికల్ కాలేజీ భవనం దాదాపు 70 సంవత్సరాల పాతది. ఇటీవల ఫైర్? సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ, ఎలక్ట్రికల్ వైరింగ్ పాతదిగా ఉండటంతో ప్రమాదాల అవకాశాలు కొనసాగుతున్నాయని స్థానికులు అంటున్నారు. గతంలో కూడా ఈ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం జరిగాయని చెబుతున్నారు. ఒడిశా ఆస్పత్రిలో అగ్నిప్రమాదం- 10 మంది మృతిఇటీవల ఒడిశాలోని కటక్ ఎస్‌బీసీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఆ ఘటనలో 10 మంది రోగులు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మంది గాయపడ్డారు. మార్చి 16న తెల్లవారుజామును 2:30 నుంచి 3 గంటల సమయంలో ప్రమాదం జరిగింది. ఐసీయూలోని ట్రామా కేర్ డిపార్ట్‌మెంట్‌లో తొలుత మంటలు చెలరేగాయి. అగ్నిప్రమా దంలో ఏడుగురు రోగులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు ఇతర వార్డులకు తరలించే సమయంలో కాలిన గాయాలు లేదా ఊపిరి ఆడక మరణించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆసుపత్రి సిబ్బంది, పోలీసులు, రోగుల బంధువుల సహాయంతో ఐసీయూలో ఉన్న రోగులను ఇతర వార్డులకు తరలించారు. ఈ ప్రక్రియలో మొత్తం 23 మంది రోగులను ఇతర విభాగాలకు మార్చారు. రోగులను రక్షించే ప్రయత్నంలో 11 మంది ఆస్పత్రి సిబ్బందికి గాయాలు కూడా అయ్యాయి. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుంటుబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. అయితే ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందని అధికారులు తెలిపారు. ఐసీయూ, పక్కనున్న వార్డులు కూడా ఈ అగ్ని ప్రమాదానికి ప్రభావితమయ్యాయని చెప్పారు.

# బీజేపీ ఎత్తు మమత పైఎత్తు: సువేందుపై నందిగ్రామ్‌లో అనూహ్య అభ్యర్థి 2021 రివేంజ్ తీరేనా?

**బంగాల్::** బీజేపీ ఎత్తు వేస్తే, బంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ పైఎత్తు వేశారు. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో తనను ఓడించిన బీజేపీ నేత సువేందు అధి కారికి గట్టి పోటీ ఇచ్చేందుకు పెద్ద స్కెచ్ వేశారు దీదీ. ఈ సారి మమతా బెనర్జీ సిట్టింగ్ అసెంబ్లీ స్థానం భవానీపుర్‌తో పాటు నందిగ్రామ్‌లోనూ సువేందు పోటీ చేస్తున్నారు. భవానీపుర్‌లో నేరుగా మమతే, సువేందును ఢీకొంటారు. ఇక నందిగ్రామ్‌లో సువేందును ఓడించేందుకు ఓ కీలక వ్యక్తిని మమతా బెనర్జీ బరిలోకి దింపారు. ఆయన పేరే పవిత్ర కర్. ఇంతకీ ఎవరీయన ? పవిత్ర కర్ ఎంట్రీతో నందిగ్రామ్ ఎన్నికల ఫలితం మారిపోతుందా ? రెండు స్థానాల్లో పోటీ చేస్తున్న సువేందుపై ఒత్తిడి పెరుగుతుందా ? ఈ కథనంలో చూద్దాం. మమత జం సువేందు : ఫ్లాష్ బ్యాక్2011, 2016 బంగాల్ అసె ంబ్లీ ఎన్నికల్లో భవానీపుర్ స్థానం నుంచి మమ తా బెనర్జీ ఎమ్మెల్యే అయ్యారు. కానీ 2021 ఎన్నికల్లో భవానీపుర్ స్థానాన్ని వదిలేసి,



నందిగ్రామ్ స్థానంలో దీదీ పోటీ చేశారు. కేవలం బీజేపీ నేత సువేందు అధికారిని ఓడించేందుకే ఆనాడు ఆమె ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. అతి విశ్వాసం, తొందరపాటుతో తీసుకున్న ఈ నిర్ణయం ఫెయిలైంది. నందిగ్రామ్‌లో 1,956 ఓట్ల స్వల్ప మెజారిటీతో బీజేపీ నేత సువేందు అధికారి గెలిచారు. వాస్తవానికి పూర్వ మేదినీపుర్ జిల్లాలోని నందిగ్రామ్ స్థానం టీఎంసీ పార్టీకి ఆయువు పట్టు లాంటిది. సువేందు అధికారి 21 సంవత్సరాలు టీఎంసీలోనే ఉన్నారు. 2007లో నందిగ్రామ్‌లో జరిగిన ప్రజా ఉద్యమంలో మమతా బెనర్జీతో పాటు స్థానిక టీఎంసీ నేతగా సువేందు అధికారి బాగా ప్రజాదరణ పొందారు. ఈ ఇద్దరికీ ఇక్కడ మంచి పాపులారిటీ, ఫాలోయింగ్ ఉన్నాయి. అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో సువేందు అధికారి 2020 డిసెంబరు 19న టీఎంసీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్ సీటును సువేం దుకు బీజేపీ ఇచ్చింది. దీంతో సువేందుపై స్వ యంగా దీదీ పోటీచేశారు. స్థానికుడు కావ ంతో సహజంగానే సువేందుకు కలిసొచ్చింది. దీని ఫలితంగానే స్వల్ప మెజారిటీతో మమతను ఆయన ఓడించగలిగారు. అయితే అప్పట్లో ఒకే ఒక ాతప్పుచేశారు. ఈసారి సువేందు అధికారి అందుకు భిన్నమైన వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ముందు జాగ్రత్త చర్యగా ఓ వైపు భవానీపుర్‌లో మమతపై, మరోవైపు తన సిట్టింగ్ స్థానం నందిగ్రామ్‌లో ఆయన పోటీ చేస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల ఫలితంపై హాట్ సీట్ల ఎఫెక్ట్ తక్కువే2021లో నందిగ్రామ్‌లో మమత ఓడిపోయినా, బంగాల్ వ్యాప్తంగా టీఎంసీ మెజారిటీ సీట్లను టీఎంసీ సాధించింది. దీంతో సీఎం అయ్యేందుకు గానూ, మళ్లీ తన సొంత నియోజకవర్గం భవానీపుర్ నుంచే దీదీ పోటీ చేశారు. అక్కడ జరిగిన బైపోల్‌లో విజయం సాధించాక ఆమె సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ లెక్కన కొన్ని అసెంబ్లీ స్థానాల్లో వచ్చే ఫలితాలు, యావత్ రాష్ట్ర ఫలితాలకు ప్రతీకగా నిలువవు అనే విషయం స్పష్టమైంది. కాకపోతే నందిగ్రామ్, భవానీపుర్ లాంటి హాట్ సీట్లు యావత్ రాష్ట్ర ఓటర్ల దృష్టిని ఆకర్షిస్తాయి. వారిని ఆలోచింపజేస్తాయి. మారుతున్న రాజకీయ సమీకరణాలకు ఆయా సీట్లు అద్దం పడతాయి. మొత్తం మీద రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనేవి అన్ని స్థానాల్లో పార్టీలు క్షేత్రస్థాయిలో ఎలా పనిచేస్తాయి ? ఎంత సమర్థంగా పనిచేస్తాయి ? ఎంతగా ప్రజలను ఆకట్టుకుంటాయి ? అనే దానిపైనే ఆధారపడి ఉంటాయి. సంక్షేమ పథకాలు, పార్టీల మేనిఫెస్టోలు, ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల నేపథ్యం అనేవి కూడా ఫలితాన్ని డిసైడ్ చేయడంలో ముఖ్య భూమికను పోషిస్తాయి.

# జ్యోతిష్కుడు అశోక్ ఖరత్‌తో సంబంధం నేపథ్యంలో



**ముంబై:** పలువురు మహిళలపై అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్యోతిష్కుడు అశోక్ ఖరత్‌తో సంబంధంపై విమర్శల నేపథ్యంలో ప్రభుత్వ, పార్టీ పదవులకు రూపాలీ చకాన్కర్ ( రాజీనామా చేశారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) మహారాష్ట్ర మహిళా విభాగం అధ్యక్ష పదవికి శుక్రవారం రాజీనామా సమర్పించారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధ్యక్షురాలు సునేత్ర పవర్‌తో చర్చించిన తర్వాత ఎన్సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలి పదవికి రాజీనామా సమర్పించా' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, అశోక్ ఖరత్, ఆయన ఆలయ ట్రస్ట్‌తో ఉన్న సంబంధాలు వెలుగులోకి వచ్చిన తర్వాత మార్చి 20న మహారాష్ట్ర రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్ష పదవి నుంచి రూపాలీ తప్పుకున్నారు. సీఎం ఫడ్నవీస్ సూచన మేరకు ఆ పదవికి చేసిన రాజీనామా లేఖను కూడా డిప్యూటీ సీఎం సునేత్ర పవర్‌కు ఆమె అందజేశారు. అశోక్ ఖరత్ ఆర్థిక వ్యవహారాలతో గానీ, ఆయనపై వచ్చిన ఆరోపణలతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె అన్నారు. మరోవైపు నాసిక్ జిల్లా మిర్గావ్‌లో ఒక ఆలయ ట్రస్ట్‌కు అధిపతిగా, ప్రముఖ జ్యోతిష్కుడిగా పేరుగాంచిన అశోక్ ఖరత్ గత మూడేళ్ల ుగా తనపై అత్యాచారం చేసినట్లు ఒక మహిళ ఆరోపించింది. దర్యాప్తు చేసిన పోలీసులు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సుమారు 58 మంది మహిళలతో లైంగిక చర్యల వీడియోలను ఒక పెన్ డ్రైవ్‌లో గుర్తించారు. దీంతో మర్చంట్ నేవీ మాజీ కెప్టెన్ కూడా అయిన అశోక్ ఖరత్‌ను మార్చి 18న పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై ఇప్పటి వరకు మొత్తం ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

# నక్సలిజంపై పోరు మార్చి 30న కేంద్రం కీలక ప్రకటన

**న్యూ ఢిల్లీ :**భారతదేశ అంతర్గత భద్రతకు దశాబ్దాలుగా సవాలుగా మారిన నక్సలిజం సమస్యను శాశ్వ తంగా పరిష్కరించే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగు వేస్తోంది. ఈ క్రమంలోన మార్చి 30న లోక్ సభలో నక్సలిజం నిర్మూలనపై ఒక చరిత్రాత్మక చర్చకు తెరలేవనుంది. దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ప్రభావాన్ని పూర్తిగా తుడిచి పెట్టేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో ప్రకటించిన 'మార్చి 2026' గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, ఈ చర్చ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభలో రూల్ 193 కింద ఈ స్వల్పకాలిక చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ఈ చర్చను ప్రారంభించనున్నారు. దేశ వ్యాప్తంగా నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వం తీసుకుంటున్న భద్రతాపరమైన చర్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సభ దృష్టికి తీసుకురానున్నారు. కేవలం ఆపరేషన్‌లే కాకుండా, నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, విద్య, వైద్య సదుపాయాల కల్పన ద్వారా ప్రజలకు ఎలాంటి సేవలందిస్తున్నారన్న అంశంపై సుదీర్ఘ చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది.

# షియా ముస్లింలపై అసిమ్ మునీర్ దురుసు వ్యాఖ్యలు- 'మైనారిటీలపై దాడి'గా అభివర్ణించిన భారత్



**న్యూ ఢిల్లీ :**షియా ముస్లింలను ఉద్దేశించి 'ఇరాన్‌కు వెళ్లిపోండి' అని పాకిస్థాన్ సైన్యాధిపతి అసిమ్ మునీర్ వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో భారత్ స్పందించింది. ఈ వ్యాఖ్యలు ఇస్లామాబాద్ మైనారిటీలపై వ్యవస్థాగత వేధింపుల కొనసాగింపని మండిపడింది. పాక్ ప్రభుత్వ ప్రాయోజిత వివక్ష నిరంతర విమర్శించిం ది. ఈ మేరకు దాయాది దేశంపై మీడియా బ్రీఫింగ్‌లో భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి వ్యాఖ్యానించారు. "షియాలనుద్దేశించి పాక్ అర్మీ చీఫ్ అసిమ్ మునీర్ చేసిన ఇటు వంటి వ్యాఖ్యలు ఒక విస్తృత సంక్షోభానికి సూ చిక. మునీర్ వ్యాఖ్యలపై వచ్చిన నివేదికలను మే ము చూశాము. ఇటువంటి వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవి కావు. షియాలు సహా మైనారిటీలపై పాకిస్థాన్ చేస్తున్న వ్యవస్థాగత వేధింపులలో ఇవి భాగం. గత కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో మైనారిటీ జనాభా తగ్గుతోంది. పాకిస్థాన్ ప్రభుత్వం చేతిలో మైనారిటీలు వేధింపులు, అణచివేతకు గురవుతున్నారు" అని రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారుషియాలపై మునీర్ ఘాటు వ్యాఖ్యలుమత నాయకులతో జరిగిన ఓ సమావేశంలో పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ రెచ్చిపోయారు. ఆ సమావేశంలో ఇరాన్‌ను అంతగా ప్రేమించేవారు పాకిస్థాన్‌ను విడిచి వెళ్లిపోవాలని వ్యాఖ్యానించారు. దీంతో మునీర్ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం చెలరేగింది. తాజాగా మునీర్ ఘాటు వ్యాఖ్యలపై భారత్ మండిపడింది. హర్మూజ్‌ను దాటిన 4 భారత్ నౌకలుఅలాగే పశ్చిమాసియాలో నెలకున్న సంక్షోభం, భారత్‌కు ఇంధన సరఫరాపై కూడా రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత జెండా ఉన్న నాలుగు ఎల్‌పీజీ ట్యాంకర్లు హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయని స్పష్టం చేశారు. నడుస్తున్నాయని వెల్లడించారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# ట్రంప్‌ను నిలువరించేదెవరు?

పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలు ఆరేలా లేవు. పరస్పర దాడులతో మరింత ఉద్రిక్తంగా మారుతోంది. దీంతో ప్రపంచ దేశాలు ఏమీ చేయలేని దుస్థితిలో ఉండిపోయాయి. అమెరికాను నిలువరించే పరిస్థితి ఏ దేశానికి లేకుండా పోయింది. సుంకాలు విధించినా చైనా, భారత్ లాంటి దేశాలు సైతం కిమ్మనకుండా మిన్నకుండాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు చమురు సంక్షోభం నేపథ్యంలోనూ అమెరికాను కట్టడిచేయగల శక్తి ఎవరికీ లేకుండా పోయింది. ట్రంప్ కూడా ఆయుధ బలంతో రెచ్చిపోతున్నాడు. ఇది ప్రపంచ వినాశనానికి కంకణం కట్టుకున్నట్ఉగా ఉంది. ఇంతటితోనే ఇది ఆగుతుందనుకోవడానికి లేదు. ఇక భూతలదాడులు జరిగితే నష్టం మరింత తీవ్రంగా ఉంటుంది. ఇరాన్‌లో భూతల దాడులకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వస్తున్న వార్తలు ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఈ దాడులను అడ్డుకొనేందుకు ఇరాన్ కూడా సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అందులోభాగంగా 10 లక్షల మందికి పైగా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సైనికాధికారులను ఉటంకిస్తూ ఆ దేశ మీడియా ఈ విషయాన్ని ఇప్పటికే వెల్లడించింది. ఓ వైపు చర్చలు కొనసాగుతున్నాయంటూనే.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియాలో తన సైనిక ఉనికిని విస్తరిస్తున్నారు. గల్ఫ్ దేశాల్లో తీవ్ర సంక్షోభం నెలకొన్నా పట్టించు కోవడం లేదు. ఆర్థికంగా దెబ్బతింటున్న పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలోనే బసిజ్ ఫోర్స్, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ తో సహా అనేక విభాగాలు తక్షణమే కదనరంగంలోకి వచ్చేవిధంగా దళాలను బలోపేతం చేస్తున్నట్లు ఇరాన్ సైనిక వర్గాలు పేర్కొన్నాయి. ఇరాన్ నేలపై అమెరికా సైన్యం అడుగుపెడితే.. వారికి నరకం చూపించేందుకు తమ యోధులు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించాయి. స్వచ్ఛందంగా సైన్యంలో చేరతామని బసిజ్ ఫోర్స్, ఐఆర్‌జీసీలకు యువకుల నుంచి పెద్దఎత్తున అభ్యర్థన లు వస్తున్నట్లు వెల్లడించాయి. ఇదిలాఉండగా.. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో యుద్ధంలో పాల్గొనేందుకు అర్హత వయసును కూడా ఇరాన్ తగ్గించినట్లు తెలుస్తోంది. 12 ఏళ్ల పిల్లలను సైతం యుద్ధంలో పాల్గొనేందుకు అనుమతివ్వాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. దీనికి 'ఫర్ ఇరాన్' అని పేరు పెట్టినట్లు వెల్లడించాయి. పెట్రోలింగ్, చెక్ పాయింట్ల దగ్గర వీరిని ఉంచనున్నారు. ఇదిలాఉండగా.. ఇరాన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ సైనిక కొరతను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. అవసరమైన దానికంటే 12వేల మంది తగ్గినట్లు సైనికాధికారులు ప్రభుత్వానికి వెల్లడించినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ కొరత కారణంగా ఐడీఎఫ్ కూలిపోయే ప్రమాదం ఉందని.. ఆ సంస్థ చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో సహా ఇతర ఉన్నతాధికారులకు కూడా ఆయన లేఖ రాశారు. ఇకపోతే హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ సాగిస్తున్న దిగ్బంధనంతో నౌకాయానం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. చాలా దేశాల్లో చమురు, గ్యాస్ సంక్షోభానికి ఇది కారణమైంది. ఇప్పుడు మరో జలసంధికి ముప్పు ముంచుకొచ్చింది. తమ ఖర్గ్ దీవిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తే బాబ్ అల్ మాండెబ్ జలసంధిని అడ్డుకుంటామని ఇరాన్ అమెరికాను హెచ్చరించడమే ఇందుకు కారణం. ఆ నౌకామార్గమూ మూసుకుపోతే ప్రపంచానికి మరిన్ని కష్టాలు తప్పవంటున్నారు. అరేబియా ద్వీపకల్పానికి పశ్చిమాన మరో జలమార్గమే బాబ్ అల్ మాండెబ్ జలసంధి. అరబిక్ భాషలో బాబ్ అల్ మాండెబ్ అంటే 'కన్నీటి ద్వారం' లేదా 'విషాద ద్వారం' అని అర్థం. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక నౌకలు ప్రమాదానికి లోనయ్యాయి. అందువల్లే ఈ మార్గానికి ఆ పేరు వచ్చింది. 1869లో సూయజ్ కాలువను తెరిచాక మాండెబ్ జలసంధికి ప్రాముఖ్యత పెరిగింది. ఇది మధ్యధరా సముద్రం,




హిందుమహాసముద్రానికి మధ్య కీలక లంకెగా మారింది. మాండెబ్ జలసంధికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఇది యెమన్, జిబౌటి మధ్య ఉంది. ఎర్ర సముద్రాన్ని అరేబియా సముద్రంతో అనుసంధానం చేస్తోంది. సూయెజ్ కాలువ దిశగా వెళ్లే నౌకలు, చమురు ట్యాంకర్లకు ఇది కీలక నడవాగా మారింది. ఎర్ర సముద్రానికి, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌కు మధ్య ద్వారంలా వ్యవహరిస్తోంది. దీని వెడల్పు 30 మీటర్లు మాత్రమే.ఆసియా, ఐరోపా, ఉత్తర అమెరికా, పశ్చిమాసియా మధ్య ప్రయాణించే నౌకల మధ్య మాండెబ్ జలసంధి ఒక గేట్‌వేలా పనిచేస్తోంది. నిత్యం ఈ మార్గంలో 45 లక్షల బ్యారెళ్ల చమురు రవాణా అవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం లో 10-12 శాతం దీని గుండానే పయనిస్తోంది. ప్రధానమైన మార్కెట్ల మధ్య ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ), తయారీ వస్తువులు, ఆహార పదార్థాలు ఈ మార్గంలోనే రవాణా అవుతున్నాయి. ఏటా రూ.93.95 లక్షల కోట్ల విలువైన సరకులు మాండెబ్ జలసంధి గుండా రవాణా అవుతున్నట్లు అంచనా. తన అజమాయిషీ లో పనిచేసే హూతీలను ఇప్పటికే మాండెబ్ మార్గంలో ఇరాన్ మోహరించింది. యెమెన్‌లోని ఈ ముఠా.. ఎర్ర సముద్ర తీరంలోని కొన్ని భాగాలను నియంత్రిస్తోంది. సముద్రంలోని లక్ష్యాలపై దాడి చేసే సామర్థ్యం ఈ ముఠాకు ఉంది. 2023 అక్టోబరు 7న గాజా యుద్ధం చెలరేగాక.. పాలస్తీనావాసులకు సంఘీభావంగా హూతీలు రంగంలోకి దిగారు. ఇరాన్, చైనాలు అందించిన డ్రోన్లు, నౌకా విధ్వంసక క్షిపణులు, విస్ఫోటక బోట్లతో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకున్నాయి. దీంతో ప్రధాన నౌకాయాన కంపెనీలు వేరే మార్గంలో పయనించాల్సి వచ్చింది. 2 నెలల కాలంలో 134 నౌకలపై దాడి చేశారు. ఫలితంగా ఎర్ర సముద్ర వర్తక నడవాలో అంతర్జాతీయ వాణిజ్యం 60 శాతానికిపైగా తగ్గింది. ఇందులో చాలావరకూ పశ్చిమ దేశాలతో ముడిపడినవే. నాలుగు నౌకలు మునిగిపోయాయి. మాండెబ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధిస్తే సరకు రవాణా నౌకలు ఆఫ్రికాలోని దక్షిణ భాగం నుంచి పయనించాల్సి వస్తుంది. దీనివల్ల ప్రయాణ సమయంతోపాటు ఖర్చులూ పెరుగుతాయి. ఇది అంతిమంగా చమురు ధరల పెరుగుదలకు, ఇంధన మార్కెట్‌లో మరింత అస్థిరతకు దారితీయవచ్చు. అయితే ఈ జలసంధి దిగ్బంధనానికి ప్రయత్నిస్తే అమెరికా గట్టిగా ప్రతిఘటించవచ్చు. మాండెబ్ జలసంధిలో జిబౌటి వైపున అగ్రరాజ్యానికి భారీ సైనిక స్థావరం ఉంది.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దు

## • ఐపిఎల్ ప్రారంభంతో
## యువతకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

**హైదరాబాద్,మార్చి28:** బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్-2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు



నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# బతుకులు 'బుగ్గి'పాలు!



రోజువారి చెమటోడ్చి పొట్టనింపుకునే చేతులు..కుటుంబపోషణ కోసం ప్రయాణించిన పాదాలు.. ఒక్క క్షణంలో అగ్నికి ఆహుతైపోయాయి. ఏపీలోని మార్కాపురం దగ్గర రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం రవాణా వ్యవస్థలోని లోపాలను మరోసారి బహిర్గతపరిచింది. ప్రయివేటు బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో పద్నాలుగు మంది సజీవ దహనమవ్వడం తీవ్ర విషాదం. ప్రాణాలు కోల్పోయిన వారంతా కూలీలే కావడం మరీ హృదయ విదారకం. ఉన్న ఊరును, కన్నవారిని వదిలి ఉపాధి కోసం వలసొచ్చిన వారు, చివరకు కుటుంబాలనే అంధకారంలోకి నెట్టారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వాల, ప్రయివేటు యాజమాన్యాల నిర్లక్ష్యమే! ఎందుకంటే, గతేడాది కర్నూల్‌లో జరిగిన ఘటనలో ఇలాగే పందొమ్మిది మంది అసువులు బాశారు. చేవెళ్లలో టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఇరవై మందివరకు కంకర కుప్పల్లోనే ఊపిరొదిలారు. ఇలా వరుస ఘటనలు జరుగుతున్నా అధికారులు పాఠాలు నేర్వక పోవడం విచారకరం.తాజా ఘటనలో మృతుల వివరాలు చూస్తే సామాన్యుల దుస్థితి స్పష్టమవుతోంది.వారంతా బతుకుదెరువు కోసం ఏపీ నుంచి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాలకు వలసొచ్చిన కూలీలు. కొందరు ఇటుకబట్టీల్లో పనిచేస్తే మరికొందరు భవన నిర్మాణరంగాల్లో స్థిరపడ్డారు. రోజూ పనిచేస్తేనే నాలుగువేళ్లూ నోట్లోకి వెళ్తాయి, లేదంటే పస్తులే. ఆస్తిపాస్తులేమీ లేవు. వచ్చే పదోపరకతోనే కుటుంబాన్ని పోషించుకుంటారు. శ్రీరామనవమి సందర్భంగా కొందరు, ఆప్తులను చూసొద్దామని మరికొం దరు సొంతూళ్లకు బయలుదేరారు. కానీ, వారి బతుకులు కన్నవారిని కలుసుకోకుండానే తెల్లారి పోయాయి.వారు ప్రయాణించిన హరేకృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు కూడా పూర్తిగా వారిని అభద్రతలోకే నెట్టేసింది. బస్సుకు మరమ్మతులు చేయించాల్సి ఉన్నా పట్టించుకోలేదు. గమ్యస్థానానికి మరో మూడు గంటల సమయం ఉందనగా స్టీరింగ్ అదుపు తప్పి నేరుగా టిప్పర్ డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వెంటనే అంటుకున్న మంటలు ప్రయాణికులను అగ్నికీలల్లో ముంచేశాయి. ఇన్ని వందల కిలోమీటర్ల మధ్య బస్సు ఫిట్‌నెస్‌ను ఒక్క అధికారి కూడా పరిశీలించక పోవడం ఇక్కడ ఆశ్చర్యకరం.

# ఇరాన్ నేత మొజ్తబా ఖమేనీ కూడా మరణించే ఉంటాడు

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
## తదుపరి తమ లక్ష్యం క్యూబా అంటూ హెచ్చరిక

**వాషింగ్టన్,మార్చి28:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ మరణించి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా సైనిక దాడులు ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టాయని, దీంతో ఆ దేశంలో నాయకత్వం లేకుండా పోయిందని ట్రంప్ చెప్పుకొచ్చారు. అమెరికాలోని మయామిలో జరిగిన ఫ్యూచర్ ఇన్వెస్ట్‌మెంట్ ఇనిషియేటివ్ ప్రయారిటీ సమ్మిట్‌లో ప్రసంగిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కార్యకలాపాల వల్ల ఇరాన్ బలహీనపడిందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఇరాన్ సైనిక సామర్థ్యాలను నిర్మూలించడంలో అమెరికా దళాలు అంచనాలకు మించి పనిచేశాయని ఆయన అన్నారు. 'ఇరాన్ నౌకాదళం అంతమైపోయింది. అదంతా అఖాతపు అడుగున మునిగిపోయింది.. వారి వైమానిక దళం పూర్తిగా, సమూలంగా నాశనమైంది. వారి విమాన నిరోధక, సమాచార ప్రసార సామర్థ్యాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయి. అంతేకాదు, ఇరాన్ నాయకత్వం, సైనిక శక్తి కూడా నాశనమైంది. వారి నాయకులందరూ చనిపోయారు.. వారి సుప్రీం లీడర్ ఇక సర్వోన్నతుడు కాదు. ఆయన మరణించారని ట్రంప్ అన్నారు. ఇరాన్ ఆయుధ నిల్వలను తాము చిన్నాభిన్నం చేస్తున్నామని, ఎవరూ ఊహించని స్థాయిలో వారి క్షిపణి, డ్రోన్ కర్మాగారాలను ధ్వంసం చేస్తున్నామని ట్రంప్ తెలిపారు. వారి రక్షణ పారిశ్రామిక స్థావరాన్ని తుడిచిపెట్టేశామని ట్రంప్ చెప్పుకొచ్చారు. ఆయతొల్లా అలీ ఖమేనీ మరణం తర్వాత, ఆయన కుమారుడైన మొజ్తబా ఖమేనీ ఇరాన్ బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. ఆయన ఇరాన్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతుడిగా, వివాదాస్పద వ్యక్తిగా పేరు పొందారు. అయితే, ఆయన బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఇటువంటి వార్తలు రావడం గమనార్హం. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం ఇప్పటి వరకు అధికారికంగా ధృవీకరించలేదు, ఖండించలేదు. సాధారణంగా ఇరాన్ తన అత్యున్నత నాయకుల ఆరోగ్య స్థితిగతులను అత్యంత రహస్యంగా ఉంచుతుంది. గతంలో కూడా అలీ ఖమేనీ ఆరోగ్యంపై అనేక




పుకార్లు వచ్చినప్పుడు ఇరాన్ నిశ్శబ్దంగానే ఉంది. ఇదే క్రమంలో వెనిజులా, ఇరాన్ తర్వాత క్యూబాపైనే అమెరికా సైన్యం దాడులు జరపనున్నట్లు ట్రంప్ హెచ్చరించారు. వెనిజులా, ఇరాన్‌పై అమెరికా సైన్యాలు విజయం సాధించాయని ట్రంప్ గొప్పగా చెప్పుకున్నారు. అమెరికా సైన్యపు విజయాలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. ఈ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ.. 'మా ప్రభుత్వం ఇటీవలి వారాల్లో క్యూబా నాయకత్వంలోని కొన్ని వర్గాలతో చర్చలు ప్రారంభించాం.. అమెరికా సైన్యం క్యూబాపై ప్రత్యక్ష సైనిక చర్యకు పాల్పడవచ్చని ' అని కూడా ఈ సందర్భంగా ట్రంప్ చెప్పారు. కొన్నిసార్లు సైన్యాన్ని ఉపయోగించాల్సి వస్తుంది. అన్నట్టు తర్వాతి వంతు క్యూబాదే' అని అన్నారు. ఈ మాటలు అన్నతర్వాత ట్రంప్ మరలా.. నేను అలా అనలేదని అనుకోండి అని ట్రంప్ అన్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో జరగబోయే సైనిక ఘర్షణను నివారించే ప్రయత్నంలో తమ దేశం అమెరికాతో చర్చలు జరుపు తోందని క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ అంగీకరించారు. ఇప్పటికే అమెరికా ఆంక్షల వల్ల క్యూబా కు సరఫరా అయ్యే చమురు దిగుమతులు తగ్గాయి. దీంతో విద్యుత్ ప్లాంట్లు, రవాణాను నడపడానికి ఆధారపడే చమురు లేక క్యూబా ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.జనవరిలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోని ఆయన భార్యని పట్టుకోవడానికి అమెరికా చేపట్టిన ఆపరేషన్‌కు ముందు.. క్యూబాకు అవసరమైన చమురులో అధిక భాగం వెనిజులా సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత వాషింగ్టన్ ఒత్తిడితో కారకాస్‌లోని కొత్త ప్రభుత్వం క్యూబాకు చమురు సరఫరాలను నిలిపివేసింది.

TO-DAY TELANGANA Telugu News Paper
నేడు తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం

# ధోని అభిమానులకు బ్యాడ్ న్యూస్.. ఐపీఎల్ 2026 నుంచి అవుట్!

మహేంద్ర సింగ్ ధోని అభిమానులకు పిడుగు లాంటి వార్త. ఐపీఎల్ 2026 మరికొన్ని గంటల్లో ఆరంభం కానున్న తరుణంలో సీఎస్కే నుంచి షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ధోని పిక్క గాయం బారిన పడ్డట్లు పేర్కొంది. దాంతో అతడు ఐపీఎల్ 2026 తొలి రెండు వారాలకు ధోని దూరం అయినట్లు పేర్కొంది. ఈ మేరకు ఎక్స్ వేదిక ద్వారా స్పష్టం చేసింది. ఈ రెండు వారాల పాటు అతడు పునరావాసంలో ఉండనున్నట్లుగా పేర్కొంది. ఇది ధోని అభిమానులకు బిగ్ షాక్ లాంటిదే. అతడు ఆడితే చూడాలనుకునే వారికి ధోని గాయం పెద్ద షాక్‌కు గురి చేసింది. గత కొన్ని రోజులుగా సీఎస్కే ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ సెషన్స్‌లో ధోని చురుకుగా పాల్గొన్నాడు. భారీ షాట్స్ ఆడుతూ కనిపించాడు. అయితే తాజాగా ధోని గాయం బారిన పడటంతో రెండు వారాల పాటు ఐపీఎల్‌కు దూరం కావడం విచారకరం.ధోని గత కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. గత రెండు సీజన్లలో మోకాలి నొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. 2024 సీజన్‌లో అయితే గాయంతోనే ఐపీఎల్ ఆడాడు. అనంతరం మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. 2025లో ఎటువంటి గాయం లేకపోవడంతో 2024 కంటే కూడా ఫిట్‌గా కనిపించాడు. అయితే ఇప్పుడు పిక్క గాయం బారిన



పడటంతో అతడి అభిమానులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ధోని వయసు 44 ఏళ్లు. ఈ ఏజ్‌లో క్రికెట్ లాంటి గేమ్స్ ఆడటం శరీరాన్ని త్వరగా అలసిపోయేలా చేస్తుంది. ప్రస్తుతానికి ధోని కేవలం రెండు వారాల ఆటకు మాత్రమే దూరమైనట్లుగా సీఎస్కే తన ట్వీట్‌లో పేర్కొంది. అయితే వయసును పరిగణలోకి తీసుకుంటే అది కష్టమనే చెప్పాలి. సీఎస్కే తన తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 3న ఆడనుంది. రెండు వారాల్లో అతడు కోలుకుంటే ఏప్రిల్ 11 లేదా 14న జరిగే మ్యాచ్‌తో అతడు రీ ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. సీఎస్కే మేనేజ్‌మెంట్ ఇచ్చిన సమాచారాన్ని బట్టి అతడు తన టీమ్ ఆడే తొలి 3 మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉంది. టీమిండియా తరఫున మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఐదు టైటిల్స్ నెగ్గాడు. ప్రస్తుతం 44 ఏళ్లు. ధోనికి క్రికెట్‌లో సాధించాల్సింది ఏముంది? ఏం లేదు.. హాయిగా రిటైర్మెంట్ ఇవ్వకుండా తన ఆరోగ్యాన్ని పాడుచేసుకోడం ఎందుకు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.



# కెప్టెన్‌గా చరిత్ర సృష్టించనున్న ఇషాన్ కిషన్

వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ సారథ్యంలో సన్‌రైజర్స్ బరిలోకి దిగనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇషాన్ కిషన్‌కు కెప్టెన్‌గా ఇదే తొలి మ్యాచ్ కానుంది. ఈ నేపథ్యంలో అతడు ఓ అరుదైన రికార్డును అందుకోనున్నాడు.ఫస్ట్ మ్యాచ్‌లో ఆర్సీబీ వర్సెస్ ఎస్ఆర్‌హెచ్ టీమ్స్ తలపడనున్నాయి. అయితే సన్ రైజర్స్ రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమిన్స్ గాయపడడంతో.. విధ్వంసరకర బ్యాటర్ ఇషాన్ కిషాన్ కెప్టెన్సీలో ఎస్ఆర్‌హెచ్ ఆడనుంది. ఇషాన్‌కి ఐపీఎల్ హిస్టరీలోనే ఫస్ట్ మ్యాచ్ ఇది. ఈ క్రమంలో ఈ స్టార్ బ్యాటర్ ఓ అరుదైన రికార్డును సృష్టించనున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు నాయకత్వం వహించిన అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్‌గా ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించనున్నాడు. ప్రస్తుతం ఇషాన్ వయసు 27 ఏళ్ల 253 రోజులు. ఇక ఓవరాల్‌గా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు అతి పిన్నవయసులో కెప్టెన్సీ వహించిన రికార్డు కివీస్ ఆటగాడు కేన్ విలియమ్సన్ పేరిట ఉంది. అతడు 27 ఏళ్ల 244 రోజుల వయసులో అంటే 2018లో ఎస్ఆర్‌హెచ్‌కు నాయకత్వం వహించాడు. ఇప్పటి వరకు శిఖర్ ధావన్, మనీష్ పాండే, భువనేశ్వర్ కుమార్ లు మాత్రమే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు నాయకత్వం వహించిన భారత ఆటగాళ్లు. షాన్ కిషన్‌ను తాత్కాలిక కెప్టెన్‌గా నియమించాలన్న జట్టు మేనేజ్‌మెంట్ నిర్ణయం పై ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డానియల్ వెటోరి సంతోషాన్ని వ్యక్తం చేశాడు. అతడు ఆత్మవిశ్వాసం గల ఆటగాడని, నాయకుడిగా తనను తాను నిరూపించుకున్నాడని చెప్పుకొచ్చాడు.ఇషాన్ కిషన్ అండర్-19 జట్టుకు, దేశవాళీలో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తన రాష్ట్ర జట్టుకు నాయకత్వం వహించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో నాయకుడిగా తన జట్టుకు టైటిల్ అందించాడు.

# రోహిత్ శర్మను చూసి ఆశ్చర్యపోయిన నీతా అంబానీ

ముంబై ఇండియన్స్ శిక్షణ శిబిరంలో ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ క్రమంలో జట్టు యజమాని నీతా అంబానీ ప్రాక్టీస్ సెషన్‌ను పరిశీలించడానికి వచ్చారు. అక్కడ రోహిత్ శర్మను చూడగానే ఆమె ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. రోహిత్ గతంతో పోలిస్తే చాలా బరువు తగ్గడమే కాకుండా, ఎంతో చురుగ్గా కనిపిస్తున్నారు. ఆయనను చూడగానే నీతా అంబానీ స్పందిస్తూ.. “మై గాడ్ రోహిత్! నేను నిన్ను గుర్తుపట్టలేకపోయాను. నువ్వు అచ్చం ఒక కుర్రాడిలా కనిపిస్తున్నావు” అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సరదా సంభాషణకు సంబంధించిన వీడియోను ముంబై ఇండియన్స్ తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లో పంచుకుంది. ఈ వీడియో పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే లక్షలాది వ్యూస్ సాధించింది. రోహిత్



శర్మ తన ఫిట్‌నెస్‌పై పెట్టిన శ్రద్ధను చూసి నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. 2026 సీజన్ కోసం రోహిత్ మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా ఎంతో సిద్ధంగా ఉన్నారని ఈ వీడియో స్పష్టం చేస్తోంది.ముంబై ఇండియన్స్ తన తొలి మ్యాచ్‌ను మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఆడనుంది. సొంత మైదానమైన వాంఖడే స్టేడియంలో జరగనున్న ఈ పోరులో రోహిత్ శర్మ కొత్త అవతారంలో బరిలోకి దిగనున్నాడు. గత సీజన్లలో ఫిట్‌నెస్‌పై వచ్చిన విమర్శలకు సమాధానం చెబుతూ, ఈసారి భారీ ఇన్నింగ్స్‌లు ఆడాలని రోహిత్ కృతనిశ్చయంతో ఉన్నాడు. హార్దిక్ పాండ్యా సారథ్యంలో రోహిత్ ఓపెనర్‌గా జట్టుకు ఎలాంటి ఆరంభాన్ని ఇస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ముంబై జట్టు ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలవడంలో రోహిత్ పాత్ర ఎంతో కీలకం. ఇప్పుడు సారథ్య బాధ్యతలు లేకపోయినా, ఒక సీనియర్ ఆటగాడిగా జట్టును నడిపించే బాధ్యత ఆయనపై ఉంది. నీతా అంబానీ అన్నట్లుగా, రోహిత్ మళ్ళీ తన కెరీర్ ఆరంభ రోజుల్లో ఉన్నంత ఫిట్‌గా కనిపిస్తుండటం జట్టుకు సానుకూల అంశం. ఈ కొత్త ఉత్సాహంతో హిట్ మ్యాన్ మైదానంలో సిక్సర్ల వర్షం కురిపిస్తారని ముంబై పల్టాన్ ఆశిస్తోంది.

# తొలి మ్యాచ్‌కు విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌లు దూరం




ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ తొలి మ్యాచ్‌కు సిద్ధమైంది. ఆదివారం తమ సొంత మైదానం వాంఖడే వేదికగా జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో అమీతుమీ తేల్చుకోనుంది. గత ఐదేళ్లుగా టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ముంబై ఇండియన్స్.. ఈ సారి ఆ కల నెరవేర్చుకోవాలనే కసితో ఉంది. వేలానికి ముందే ప్లేయర్ ట్రేడింగ్ విండో ద్వారా జట్టును పటిష్టం చేసుకుంది. ఆన్‌పేపర్‌పై ముంబై ఇండియన్స్ మిగతా 9 జట్ల కంటే పటిష్టంగా ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా వంటి మ్యాచ్ విన్నర్లతో భీకరంగా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే క్రికెట్ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు ఏఐ ఫ్లాట్ ఫామ్స్ అన్నీ ముంబై ఇండియన్సే విజేతగా నిలుస్తుందని జోస్యం చెప్పాయి. గతేడాది ప్లే ఆఫ్స్ చేరినా.. ఫైనల్ చేరకుండానే హార్దిక్ సేన టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే ఈ సీజన్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజేతగా నిలవాలనే పట్టుదలతో ముంబై ఇండియన్స్ ఉంది. అయితే స్టార్ ఆల్‌రౌండర్స్ విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌లు కేకేఆర్‌తో తొలి మ్యాచ్‌కు దూరంగా ఉండనున్నారు. ఈ ఇద్దరూ ఇంకా ముంబై ఇండియన్స్ జట్టుతో కలవలేదు. సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన సాంట్నర్.. చివరి రెండు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. అతను ఇంకా ముంబై ఇండియన్స్ జట్టులో చేరలేదు. ఎప్పుడు చేరుతారనే విషయంపై క్లారిటీ లేదు.మరోవైపు విల్ జాక్స్ వ్యక్తిగత కారణాలతో ఇంకా భారత్‌కు రాలేదు. ఈ ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ ఇద్దరి గైర్హాజరీ ముంబై ఇండియన్స్‌కు గట్టి ఎదురు దెబ్బే. బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్ చేయగల సామర్థ్యం వీరికి ఉంది. సాంట్నర్ స్థానంలో అఫ్గాన్ మిస్టరీ స్పిన్నర్ అల్లా గజన్‌ఫర్ ఆడనుండగా.. విల్ జాక్స్ స్థానంలో మయాంక్ మార్కండేను ఆడించవచ్చు. మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్ ఓపెనర్లుగా బరిలోకి దిగనున్నారు. ర్యాన్ రికెల్టన్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశాలు ఉన్నాయి. సూర్య, తిలక్ వర్మ, నమన్ ధీర్ మిడిలార్డర్‌లో ఆడనుండగా.. హార్దిక్ పాండ్యా ఫినిషర్ పాత్ర పోషించనున్నాడు. మయాంక్ మార్కండే, అల్లా గజన్‌ఫర్ స్పిన్నర్లుగా ఆడనుండగా.. దీపక్ చాహర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. ఇంపాక్ట్ ప్లేయర్లుగా అశ్వని కుమార్, అథర్వ అంకోలేకర్, ర్యాన్ రికెల్టన్‌లో ఒకర్ని ఆడించవచ్చు. కేకేఆర్‌తో ముంబై ఇండియన్స్ తుది జట్టు(అంచనా)రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్/ర్యాన్ రికెల్టన్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, నమన్ ధీర్, హార్దిక్ పాండ్యా(కెప్టెన్), మయాంక్ మార్కండే, దీపక్ చాహర్, అల్లా గజన్‌ఫర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్.ముంబైఇండియన్స్ పూర్తి జట్టు:రోహిత్ శర్మ, డికాక్, తిలక్ వర్మ, సూర్యకుమార్, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, డానిష్ మలేవార్, హార్దిక్ పాండ్యా, విల్ జాక్స్, శాంట్నర్, రాజ్ బజ్వా, కార్బిన్ బాష్, శార్దూల్, మయాంక్ రావత్, అథర్వ అంకోలేకర్, రాబిన్ మిన్జ్, రికెల్టన్, నామన్ ధిర్, బుమ్రా, దీపక్ చాహర్, అశ్వనీ కుమార్, బౌల్ట్, మహ్మద్ ఇజార్, అల్లా ఘజన్ఫర్, రఘు శర్మ, మార్కండే.

# ఐపీఎల్ ప్రసారాలపై బంగ్లాదేశ్ గ్రీన్ సిగ్నల్

గత ఏడాదిన్నర కాలంగా భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నాయి. బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి 'క్రికెట్ దౌత్యాన్ని' ఆయుధంగా ఎంచుకుంది. ఇందులో భాగంగానే ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రసారాలపై ఉన్న అడ్డంకులను తొలగించింది. ఈ నిర్ణయం ద్వారా ఇరు దేశాల మధ్య మళ్లీ క్రికెట్ సంబంధాలు బలపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. బంగ్లాదేశ్ నూతన సమాచార, ప్రసార శాఖ మంత్రి జహీర్ ఉద్దీన్ స్వపన్ శనివారం ఈ కీలక ప్రకటన చేశారు. ఐపీఎల్ ప్రసారాలను తాము అడ్డుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా ఛానల్ లేదా బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయాలనుకుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి అభ్యంతరం ఉండదని తెలిపారు. క్రీడలను, రాజకీయాన్ని వేర్వేరుగా చూడాలని తమ ప్రభుత్వం భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రసారకర్త స్టార్ స్పోర్ట్స్ తమ దేశంలో మ్యాచ్‌లను చూపిస్తే తమకు ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. గతంలో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాల మేరకు విడుదల చేయడంతో పెద్ద దుమారం రేగింది. అప్పట్లో అధికారంలో ఉన్న తాత్కాలిక ప్రభుత్వం దీనిని తీవ్రంగా పరిగణించి భారత్‌కు వ్యతిరేకంగా కఠిన నిర్ణయాలు తీసుకుంది. అందులో భాగంగానే ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేయడంతో పాటు, భారత్‌లో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో కూడా బంగ్లాదేశ్ జట్టు పాల్గొనకుండా అడ్డుకుంది. దీనివల్ల బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు భారీగా నష్టపోయింది.బంగ్లాదేశ్ ప్రభుత్వ తాజా నిర్ణయంతో అక్కడ ఉన్న లక్షలాది మంది ఐపీఎల్ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 19వ సీజన్ ప్రారంభం రోజే ఈ అనుమతి రావడం విశేషం. ఇది కేవలం ప్రసారాలకే పరిమితం కాకుండా, వచ్చే ఏడాది ఐపీఎల్ సీజన్లలో బంగ్లాదేశ్ ఆటగాళు మళ్లీ ఐపీఎల్ జట్లలో చేరడానికి మార్గం సుగమం చేస్తుందని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు.

# నా కడుపులో బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లినే..

- తెలుగు ఇన్‌ఫ్లూయెన్సర్ షాకింగ్ వీడియో



సోషల్ మీడియా వచ్చిన తర్వాత చాలా మంది రీల్స్ పిచ్చితో పిచ్చి పిచ్చి వేషాలు చాలానే వేస్తున్నారు. లైకులు పిచ్చితో కొంతమంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటుంటే మరికొంతమంది చిత్రవిచిత్రమైన పనులు చేస్తుంటారు. అవి చూస్తే కొన్నిసార్లు నవ్వు వస్తుంది కానీ చాలా సార్లు చిరాకు కూడా వస్తుంది. అలాంటి వీడియోనే ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ చాలా మంది రకరకాలుగా పాపులర్ అవుతుంటారు. కొందరు గ్లామర్ తో మరికొంతమంది కామెడీతో, ఇంకొంతమంది తమ యాక్టింగ్ స్కిల్స్ తో క్రేజ్ తెచ్చుకుంటుంటారు, వీరందరి కంటే ఎక్కువ మంది క్రింజ్ తో పాపులర్ అవుతుంటారు. ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్న ఓ వీడియో. ఓ అమ్మాయి తన కడుపులో బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీ అంటూ వీడియోలు చేసి షాక్ ఇచ్చింది. అంతే కాదు విరాట్ తనకు లవ్ బైట్ ఇచ్చాడని వీడియోలు చేసి సోషల్ మీడియాలో షేర్ చేస్తుంది ఆమె.. ఆమె పేరు పెద్దగా ఎవ్వరికీ తెలియదు కానీ.. సోషల్ మీడియాలో గతంలో స్వేయ్ గర్ల్ పేరుతో వీడియోలు చేసేది. క్రికెటర్ విరాట్ కోహ్లీకి వీరాభిమాని అయిన ఆమె ఎక్కువగా ఆర్సీబీకి సపోర్ట్ చేస్తూ వీడియోలు చేసేది. ప్రతి ఐపీఎల్ సీజన్ కు రకరకాల వీడియోలు చేస్తూ పాపులర్ అయ్యింది. కొంతమంది ఆర్సీబీ ఫ్యాన్స్ కూడా ఈ అమ్మడికి తెగ సపోర్ట్ చేస్తుంటారు. ఇంతవరకూ బాగానేఉంది .. కానీ రీసెంట్ గా ఆమె తన కడుపులో పెరుగుతున్న బిడ్డకు తండ్రి విరాట్ కోహ్లీ అని చెప్పి షాక్ ఇచ్చింది. అంతే కాదు విరాట్ తనకు లవ్ బైట్ ఇచ్చాడు అని కూడా చెప్పుకుంటూ వీడియో చేసింది. ఈ వీడియో వైరల్ అవ్వడంతో కోహ్లీ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో మండిపడుతున్నారు. ఈ పాపులారిటీ కోసం మా అభిమాన క్రికెటర్ పేరు చెడగొడతావా.? అంటూ ఫైర్ అవుతున్నారు.

TO-DAY TELANGANA Telugu News Paper
టుడే తెలంగాణ
తెలుగు దినపత్రిక నిజం మా నైజం



# వాలీబాల్ నేపథ్యంలో వరుణ్ తేజ్ 'బరి'

# క్లాప్ కొట్టిన పవన్ కల్యాణ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త సినిమా శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. 'బరి' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి ఆయన క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు .హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో పూజా కార్యక్రమాలతో ఈ వేడుక జరిగింది. ఈ సినిమాకు వరుణ్ తేజ్ సోదరి నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. తన సొంత



నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌పై ఆమె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదువంశీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలోని వాలీబాల్ క్రీడ ఆధారంగా ఈ సినిమాను హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.ప్రస్తుతం వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' అనే హారర్ కామెడీ సినిమా షూటింగ్‌లో చివరి దశలో ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే 'బరి' చిత్రీకరణలో పాల్గొంటారు. ఈ సినిమాను తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో 2027 సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.

# వెంకటేశ్, కల్యాణ్‌రామ్‌తో అనిల్ రావిపూడి కొత్త సినిమా!



వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్టును ప్రకటించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా ఒక భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు అధికారికంగా వెల్లడించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'భగవంత్ కేసరి', 'మన శంకర వర ప్రసాద్ గారు' వంటి విజయవంతమైన చిత్రాల తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న మరో భారీ చిత్రమిది. సురేశ్ ప్రొడక్షన్స్, అర్చన ఈ సినిమాను సమర్పిస్తుండగా, జీ స్టూడియోస్ సహ నిర్మాతగా వ్యవహరిస్తోంది. ఈ ప్రాజెక్టుకు తాత్కాలికంగా  అనే వర్కింగ్ టైటిల్స్ పెట్టారు.వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఇది ఐదో సినిమా కావడం విశేషం. వీరిద్దరి కలయికలో గతంలో వచ్చిన »F2», »F3', 'సంక్రాంతికి వస్తున్నాం', »MSG» వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. అలాగే, 'పటాస్' వంటి సూపర్ హిట్ తర్వాత కల్యాణ్ రామ్‌తో అనిల్ రావిపూడికి ఇది రెండో సినిమా. దీంతో ఈ కొత్త ప్రాజెక్టుపై అంచనాలు భారీగా పెరిగాయి.


ఈ సినిమాను పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నట్టు చిత్ర వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించనున్నారు.



# కొలిక్కిరాని వివాదం..

## 'జననాయగన్' మరోసారి రిలీజ్ వాయిదా?

తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన చిత్రం 'జననాయగన్'. నిజానికి ఈ సినిమా ఈ జనవరిలోనే విడుదల కావాల్సింది. కానీ, కొన్ని కారణాల వల్ల సినిమా విడదుల వాయిదా పడుతూ వస్తుంది. తాజ నివేదికల ప్రకారం ఈ సినిమా విడుదల మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. విజయ్ పుట్టినరోజున ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చాయి. జూన్ 22న హీరో పుట్టినరోజు కావడంతో ఈ సినిమాను జూన్ 18వ తేదీన విడుదల చేస్తారని అంతా భావించారు. అయితే ఈ తేదీకి కూడా సినిమా రావడం కష్టమే అని తెలుస్తోంది. ఈ సినిమాను నిర్మించిన కెవిఎన్ ప్రొడక్షన్స్ చేతిలో ప్రస్తుతం భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో యశ్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా ఒకటి. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది. దీంతో జులైలో 'జననాయగన్'ను రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.



# పట్టు పరికిణిలో ఆకట్టుకుంటున్న వైష్ణవి చైతన్య!

వైష్ణవి చైతన్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసే ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంది. తాజాగా ఆమె పట్టు పరికిణి ధరించి దిగిన ఫోటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి. వెండితెరపై ఎంత గ్లామరస్‌గా కనిపించినా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో ఆమెను చూడటం తమకు ఎంతో ఇష్టమని ఫాలోయర్స్ కామెంట్స్ చేస్తున్నారు. కేవలం ఫోటోలతోనే కాకుండా, తన కళ్ళతోనే హావభావాలను పలికిస్తూ కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టిస్తోంది. ఈ ఫోటోలు చూస్తుంటే వైష్ణవి తన తదుపరి సినిమాల కోసం ఎంతగా సిద్ధమవుతుందో అర్థమవుతోంది ఆనంద్ దేవరకొండతో మరో క్రేజీ ప్రాజెక్ట్: కెరీర్ విషయానికి వస్తే, వైష్ణవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత మళ్ళీ ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఏ పిక్' అనే చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాకు ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. గత ఏడాది సిద్ధూ జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటించి మెప్పించిన ఈ భామ, ఇప్పుడు ఈ కొత్త సినిమాతో తన సక్సెస్ గ్రాఫ్‌ను మరింత పెంచుకోవాలని చూస్తోంది.ూశ్రీంశీ =ముౖఱ - లగాన్..దంగల్..బుచ్చిబాబు భలే ప్లాన్ చేశాడే! కోలీవుడ్‌లోనూ వైష్ణవి హవా.. వరుస ఆఫర్లు: వైష్ణవి క్రేజ్ కేవలం టాలీవుడ్‌కే పరిమితం కాలేదు. ఇప్పుడు పక్కనే ఉన్న కోలీవుడ్‌లోనూ ఈమె పేరు మారుమోగుతోంది. తమిళ స్టార్ హీరో ఆర్య సరసన ఒక క్రేజీ ప్రాజెక్టులో నటిస్తున్నట్లు సమాచారం. అలాగే హీరో విష్ణు విశాల్ సరసన మరో తమిళ చిత్రంలో నటించే అవకాశం వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా మొదలయ్యాయని తెలుస్తోంది. ఇవే కాకుండా ఒక సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో కూడా ఆమె కీలక పాత్ర పోషిస్తోంది

# కరుప్పుపై భారీ హైప్.. టెన్షన్ లో ఫ్యాన్స్

సూర్య నటించిన కరుప్పు సినిమా రిలీజ్ కు రెడీ అవుతున్న నేపథ్యంలో, ఈ ప్రాజెక్ట్ చుట్టూ ఆసక్తికరమైన చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఇది సూర్య కెరీర్‌లో ఒక కీలక మలుపుగా మారుతుందా అనే ప్రశ్న ఇప్పుడు అభిమానుల్లో ఎక్కువగా వినిపిస్తోంది. గత కొన్ని సినిమాలుగా ఆయన చేసిన ప్రయోగాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, ఫ్యాన్స్ కోరుకునే సూర్య మాత్రం కనిపించలేదనే భావన ఉంది. ఈ నేపథ్యంలో కరుప్పు ఆ లోటును తీర్చగలదా అన్నది ఇప్పుడు ప్రధాన చర్చాంశంగా మారిందిఈ సినిమాను కేవలం కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా మాత్రమే కాకుండా, ఒక స్పష్టమైన సోషల్ మెసేజ్ తో తెరకెక్కించినట్లు చెప్పడం ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం తమిళ సినీ పరిశ్రమలో హీరోలను ఎక్కువగా రౌడీలు లేదా పోలీసులుగా చూపించే ట్రెండ్ పెరిగిందని, దీంతో పాత్రల్లో సహజత్వం, వైవిధ్యం తగ్గిపోయిందని బాలాజీ అభిప్రాయపడుతున్నారు. కరుప్పు ద్వారా సాధారణ మనుషుల కథలను, రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పాత్రలను తెరపైకి తీసుకురావడానికి బాలాజీ ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది.



## ప్రభాస్ సినిమాలో రోల్..

# విమర్శలపై స్పష్టత ఇచ్చిన నటి రాశి

ప్రభాస్ సినిమాలో నటించడంపై తాను చేసిన వ్యాఖ్యల గురించి సోషల్ మీడియాలో వస్తున్న విమర్శలపై సీనియర్ నటి రాశి స్పందించారు. ప్రభాస్‌కు తల్లి పాత్రలో తప్ప మరే ఇతర పాత్రలోనైనా నటించడానికి సిద్ధమేనని, సోదరి పాత్ర చేయనని తాను చెప్పలేదని స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ విషయంపై మాట్లాడారు.ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ప్రభాస్ అంటే ఇష్టమని, కానీ ఆయనకు తల్లిగా మాత్రం నటించనని రాశి చెప్పిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ప్రభాస్ సినిమాలకు గతంలో డబ్బింగ్ చెప్పినా, ఆయన్ను కలవలేకపోయానని కూడా ఆమె గతంలో పేర్కొన్నారు.

'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ దర్శకత్వంలో రాగ్ మయూర్ హీరోగా 'అనుమాన పక్షి' తెరకెక్కింది. ఈ చిత్రంలో తన పాత్ర గురించి వినగానే ఎలాంటి సందేహం లేకుండా ఒప్పుకున్నానని రాశి తెలిపారు. హీరోయిన్‌గా 148 సినిమాలు చేశానని, ఆ అనుభవంతో ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుంది ధీమాగా చెబుతున్నానన్నారు.

